# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

15 ANNIVERSARY

హైదరాబాద్
4-5-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 32

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం

### దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

దానికి సహకరించేవారిని కూడా వదిలిపెట్టం

మరోఆరు ఘాటు హెచ్చరిక చేసిన ప్రధాని మోడీ

అంగోలా అధ్యక్షుడి పర్యనటతో సంయుక్త మీడియాసమావేశం

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు.

మిగతా 2లో

# కేబినెట్ విస్తరణకు రెడీ...

### త్వరలో కొత్త మంత్రులు...రెండు మూడు రోజుల్లో జాబితా విడుదల

కేబినెట్ విస్తరణ అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఇటీవల ఉగాదికి విస్తరణ జరుగుతుందని ప్రచారం జరిగినా చివరి నిమిషంలో వాయిదా పడింది. తాజాగా శుక్రవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ ) భేటీ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళడంతో మంత్రివర్గ విస్తరణపై మళ్ళీ చర్చ మొదలైంది. ఈ సారి ఎట్టి పరిస్థితుల్లోనూ కేబినెట్ ను విస్తరించడం ఖాయమన్న టాక్ వినిపిస్తోంది. పార్టీలో అన్ని వర్గాల వారికి కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని హైకమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో సామాజిక న్యాయం చేశామన్న సంకేతాలు ప్రజల్లోకి బలంగా వెళ్ళాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది.

- వెంటనే ప్రమాణ స్వీకారం...ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ.
- సీడబ్ల్యూసీ మీటింగ్ కు హాజరు...విస్తరణపై పార్టీ పెద్దలతో చర్చలు.
- జాబితా లో వివేక్, శ్రీహరి, రాజగోపాల్ రెడ్డి, ఆది శ్రీనివాస్, బాలూ నాయక్, మీర్ అలీఖాన్ కు చోటు దక్కే అవకాశం.
- కుల గణన పై కేంద్ర నిర్ణయంతో పార్టీలో జోష్.
- తెలంగాణ నే రోల్ మోడల్ అని ప్రచారం.



ఇదే ఊపులో మంత్రివర్గ విస్తరణ కు ప్లాన్.







**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** కేబినెట్ విస్తరణ అంశం మళ్ళీ తెరపైకి వచ్చింది. ఇటీవల ఉగాదికి విస్తరణ జరుగుతుందని ప్రచారం జరిగినా చివరి నిమిషంలో వాయిదా పడింది. తాజాగా శుక్రవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ( సీడబ్ల్యూసీ ) భేటీ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళడంతో మంత్రివర్గ విస్తరణపై మళ్ళీ చర్చ మొదలైంది. ఈ సారి ఎట్టి పరిస్థితుల్లోనూ కేబినెట్ ను విస్తరించడం ఖాయమన్న టాక్ వినిపిస్తోంది. పార్టీలో అన్ని వర్గాల వారికి కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని హైకమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో సామాజిక న్యాయం చేశామన్న సంకేతాలు ప్రజల్లోకి బలంగా వెళ్ళాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది.

మిగతా 2లో

# నల్గొండ జిల్లా ఐఎస్ఐ తీవ్రవాదుల అడ్డా !

## మదర్సాల పై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు ?

నల్గొండ ఉగ్రవాదులకు సేఫ్ జోన్ గా మారింది.

కలెక్టర్, ఎస్పీ లు మదర్సాల ను కూడా చెక్ చేయాలి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అవినీతి పెరిగింది.

ఎంపీ రఘునందన్ రావు వివాదాస్పద వ్యాఖ్యలు




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** "నల్లగొండ జిల్లా ఆ రెండు తీవ్ర వాదాలకు అడ్డాగా మారిందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అటల్ బిహారీ వాజపేయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ... నల్గొండ సెన్సిటివ్ జిల్లా అని, వామపక్ష తీవ్రవాదం, ఐఎస్ఐ తీవ్రవాదం అన్నింటికీ అడ్డాగా నల్గొండ


మిగతా 2లో



## 42సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం లాభం

ఉపాధి కూలీల పనిదినాలు తగ్గినా పట్టింపేది

మిగతా 2లో





## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

- అవినీతికి చోటు లేకుండా కఠిన చర్యలు
- పేదలకే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత మీదే
- యువ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి సూచన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పేదోడి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో

## ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

- రైతులకు అందిస్తున్న సహకారంతోనే సాధ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



మిగతా 2లో

**హనుమకొండ,(క్రైమ్ మిర్రర్):** ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని



## రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం

- తెలంగాణలో రహదారుల విస్తరణకు కృషి
- రేపు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి గడ్కరీ రాక
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

మిగతా 9లో

## పాక్ నుంచి అన్నిరకాల దిగుమతులపై భారత్ నిషేధం

- ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులన్నింటికీ వర్తిస్తుందని స్పష్టీకరణ
- కొరియర్లు, పార్సిల్ సేవలు కూడా పూర్తిగా నిలిపివేత
- పాక్ నౌకలేవీ భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం
- భారత్ నుంచి దిగుమతులను ఇప్పటికే నిలిపేసిన పాక్
- ఇరు దేశాల మధ్య రూ.80 వేల కోట్లకుపైనే వాణిజ్యం




## 42సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం లాభం

హైదరాబాద్,మే3(ఆర్ఎన్ఎ):ఉపాధి హామీ పనిదినాలు 2024-25 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే కూలీల పనిదినాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏం లేదని హరీష్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటు-ందని హరీష్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో రూ.12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం రూ. 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని హరీష్‌రావు కోరారు.

## రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5న కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తెలంగాణకు రానున్నారు. 5,416 కోట్ల రూపాయలతో 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి. నితిన్ గడ్కారీ అదిలాబాద్ , హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయీ హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ- కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్- శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. గత 10 సంవత్సరాలలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, అన్ని రాష్ట్రాలరాజధానులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి కేంద్రం కృషి చేస్తున్నది. ఈ నిర్మాణం వెనుక ఉన్న ముఖ్యమైన అంశం తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ. 2014 వరకు రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం 5,200 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విస్తరణ తెలంగాణలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారుల అనుసంధానానికి తోడ్పడిందని అన్నారు. హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా ప్రయాణానికి సంబంధించిన దూరం తగ్గించబడుతుంది. దీనితో పాటు-, హైదరాబాద్-విజయవాడ మధ్య జాతీయ రహదారికి 6 లేన్‌ల నిర్మాణం కూడా జరుగుతుందని ఆయన చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల భూ సేకరణ సమస్యలు తలెత్తుతున్నాయి. భూ సేకరణ ఆలస్యం అయితే, నిర్మాణం కూడా ఆలస్యం అవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఎంత త్వరగా భూమి సేకరించబడితే, అంత త్వరగా రహదారుల నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాదిమంది కోట్లతో వందల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరుగుతుంది. తెలంగాణకు సంబంధించి 5 ప్రధాన కారిడార్ల నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు.

## ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెరిఫై చేసిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని.. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో చారిత్రక, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ప్రభుత్వం తమదేనని.. ఎంత ఖర్చైనా సరే నిరుపేదలకు సన్న బియ్యం అన్నం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్, వ్యవసాయ శాఖలకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో వానాకాలం, యాసంగిలో వరి పండిందని తెలిపారు. రాష్ట్రంలో 2.80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని.. రెండు సీజన్లలో రబీ, యాసంగి సీజన్లలో సన్న ధాన్యానికి రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇస్తోందని.. ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకు ధాన్యం అమ్మే రాష్ట్రాల్లో తెలంగాణే ముందు వరుసలో ఉందని తెలిపారు. దేవాధుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించామన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను, సుందరీకరణ పనులను భారీ స్థాయిలో చేపట్టామని తెలిపారు.

## నల్గొండ జిల్లా ఐఎస్ఐ తీవ్రవాదుల అడ్డా !

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగపడుతోందని హాట్ కామెంట్స్ చేశారు. దేశంలో ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా, దానికి మూలాలు నల్లగొండలో కనపడుతున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు నల్లగొండ 'సేఫ్ జోన్' గా మారిందన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయ, మత వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. బీజేపీ ఎదుగుదలకు ఈ రెండు తీవ్రవాద సంస్థలకు సంబంధించిన వ్యక్తులు అడ్డుపడుతుంటే, బీజేపీ కార్యకర్తలు ప్రాణ త్యాగాలకు తెగించి ఇక్కడ పార్టీని నడిపిస్తున్నారని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడిలో మతం పేరు మీద హిందువులను కాల్చి చంపిన తర్వాత దేశం ఎక్కడికి పోతుందో సమాజం ఆలోచించాలని అన్నారు.రకరకాల జీహాద్ ల పేరుతో వచ్చి, ఇవాళ మదర్సాల పేరుతో జీహాద్ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎవరి అనుమతితో మదర్సాలు నడుస్తున్నాయని ప్రశ్నించిన ఆయన.. మదర్సాలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ విమర్శలు గుప్పించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్కూళ్లు, కాలేజీలను తనిఖీ చేసినట్టే మదర్సాలను కూడా తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. మదర్సాలలో ఎవరు ఉంటున్నారు.. వారికి నేర్పిస్తున్న కోర్సులు ఏంటి అనేవి విచారణ చేయాల్సిన అవసరం



ఉందన్నారు. కుల గణనలో తప్పులు జరిగినట్లు కాంగ్రెస్ నేతలే ఒప్పుకుంటున్నారని, రాష్ట్రంలో కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మదర్సాల గురించి కూడా ఆలోచించాలని చెప్పారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ధాన్యం కొనుగోళ్లలో అవినీతి పెరిగిందని, అన్నదాతలను నిరాశలో ముంచేశారని విమర్శించారు. ఎస్సెల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనలో మృతదేహాలను బయటకు తీయలేని చేతకాని ప్రభుత్వమిదని ఆరోపించారు. నల్గొండ లాంటి ప్రాంతాల్లో ఐఎస్ఐ ఉగ్రవాదులు వచ్చి నేరాలు, ఘోరాలు చేస్తుంటే జిల్లా ఎస్పీ, కలెక్టర్లకు మదర్సాలు, రోహింగ్యాలు, బంగ్లాదేశీయుల లెక్కలు చెప్పడానికి మనసు రావట్లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారం మారినప్పుడల్లా అధికార యంత్రాంగం వారికి బాకా ఊదడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో జరుగుతున్న తప్పొప్పులను చూడటంలో పూర్తిగా విఫలమతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ గుడి ఘటనలో, మెదక్ పార్లమెంట్ సదాశివ పేట ఘటనలో నిన్న కొమురవెల్లి లో జరిగిన ఘటనలో మతిస్థిమితం లేని వాళ్లు అందరూ గుళ్ల కే వెళుతున్నారని అన్నారు. ఏ ఒక్కరోజు కూడా మసీదులో గానీ, చర్చిలో గానీ మతిస్థిమితం లేని వ్యక్తి వెళ్లి యూరిన్ పాస్ చేసినట్టు వార్తలు కనిపించలేదని తెలిపారు. కొమురవెల్లి ఘటనలో పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తి దైవ విగ్రహంపై యూరిన్ పాస్ చేశారని చెబుతున్నారని, అలాగే జిన్నారం ఘటనలో కోతులు వెళ్లి విగ్రహాన్ని ఊపి పడేశాయని చెబుతున్నారని, కోతులు పడేసేలా తెలికగా విగ్రహాలు ఉంటాయా అని బీజేపీ ఎంపీ ప్రశ్నించారు.

## కేబినెట్ విస్తరణకు రెడీ...

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో పాస్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఇదే ఊపులో కేబినెట్ లోనూ సామాజిక న్యాయం చేసిందనిపించుకోవాలనేది పార్టీ పెద్దల వ్యూహంగా చెబుతున్నారు. ఎప్పటి నుంచో కేబినెట్ లో బెర్త్ కోసం వేచి చూస్తున్న నేతలకు ఈ సారైనా మంత్రి పదవులు దక్కుతాయా లేదా అన్నది సర్వత్రా ఉత్కంఠగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. సీడబ్ల్యూసీ భేటీకి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. పార్టీ సీడబ్ల్యూసీ సమావేశానికి ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో ఉగ్రదాడి, జనాభా లెక్కలతో పాటే కుల గణన నిర్వహించాలనే మోదీ సర్కార్ నిర్ణయం, తాజా రాజకీయ పరిణామాల పై సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించారు. ప్రధానంగా కుల గణన పై పార్టీ భవిష్యత్ వ్యూహాలు, విధి విధానాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో నిర్వహించిన బీసీ కుల గణన కు సంబంధించిన వివరాలను సీడబ్ల్యూసీ సభ్యులకు వివరించే అవకాశం ఉందని తెలుస్తోంది. పనిలో పనిగా పార్టీ పెద్దలతో కొత్త మంత్రుల జాబితాపై సీఎం ఆమోదముద్ర వేయించుకుంటారన్న ప్రచారం జరుగుతోంది. రేవంత్ కేబినెట్ లో ఖాళీగా ఉన్న ఆరు కు ఆరు బెర్త్ లను ఈ సారి ఫుల్ ఫిల్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తం ఆరుగురికి మంత్రి పదవులు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. అయితే ప్రస్తుతం కేబినెట్ లో రంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి చోటు లేదు. దీంతో ఆయా జిల్లాల్లోని వివిధ సామాజిక వర్గాల నేతలంతా మంత్రి పదవుల రేసులో ఉన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డి తో పాటు పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు తో పాటు ఎమ్మెల్యే వివేక్ పేరు సైతం వినిపిస్తోంది. ఇటీవల ఓ సభలో మాట్లాడిన ప్రేమ్ సాగర్ రావు తనకు మంత్రి పదవి రాకుంటే భవిష్యత్ కార్యాచరణ తీవ్రంగా ఉంటుందని పార్టీకి ఓపెన్ గానే వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రేమ్ సాగర్ రావు హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి పదవి ఎవరిని వరిస్తుంది అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక మంత్రి పదవి రేసులో ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి వాకాటి శ్రీహరి ముదిరాజ్ పేరు వినిపిస్తోంది. అదే విధంగా నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు సైతం వినిపిస్తోంది. ఎంపీ ఎన్నికల్లో భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి ని గెలిపిస్తే కేబినెట్ లో బెర్త్ కేటాయిస్తామంటూ అధిష్టానం తనకు ఆఫర్ ఇచ్చినట్లు స్వయంగా రాజగోపాల్ రెడ్డే చెప్పుకుంటున్నారు. చామల గెలుపుతో తనకు కేబినెట్ లో బెర్త్ ఖాయమన్న ధీమాతో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. కాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కేబినెట్ లో కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే రాజగోపాల్ రెడ్డికి కేబినెట్ లో చోటు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సైతం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. తనకు మంత్రి పదవి రాకుడదన్న ఉద్దేశ్యంతోనే పార్టీ సీనియర్ నేత జానారెడ్డి ఇటీవల అధిష్ఠానానికి లేఖ రాశారని బహిరంగంగానే రాజగోపాల్ రెడ్డి ఫైర్ అవడం సంచలనం రేపింది. ఇక హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఎప్పటినుంచో కోరుతున్నారు. అధిష్టానం పెద్దల దగ్గర ఈయన తన ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లుగా తెలుస్తోంది. ఇక మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ మీర్ అలీఖాన్ కు కూడా అవకాశం ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఈ సారి కేబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని జానారెడ్డి ఇప్పటికే అధిష్ఠానానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు కేబినెట్ లో ప్రాతినిధ్యం లేని మున్నూరు కాపు కోటాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కూడా ఛాన్స్ ఉండొచ్చని చెబుతున్నారు. మరోవైపు కేబినెట్ లో ప్రాతినిధ్యం లేని లంబాడా కమ్యూనిటీ నుంచి దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్ కు కూడా కేబినెట్ లో బెర్త్ దక్కవచ్చని టాక్ వినిపిస్తోంది.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది రూ.22వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని అన్నారు. మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ లో శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో 350 మంది ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆరు రోజులపాటు అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్లు- అందజేశారు. అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ -2లో పనిచేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్-1కి, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందరభంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సక్సెస్ కావాలంటే యువ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం శిక్షణ పూర్తిచేసుకున్న 390 మందియువ అసిస్టెంట్ ఇంజనీర్లంతా ఇందుకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలా? ఇతర పార్టీలా అన్ని పార్టీల వారికి.. అర్హులైన పేదలకే ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవారికి అందాలంటే అది పేద కుటుంబాల నుంచి వచ్చిన యువ ఇంజనీర్లకే తెలుసన్నారు. ఎవరూ ప్రలోభాలు పెట్టినా డబ్బుకు ఆశపడొద్దని హెచ్చరించారు. 600 చదరపు మీటర్లు లోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని.. ఎక్కు జాగలో ఇళ్లు కడితే తర్వాత వచ్చే డబ్బులు ఇవ్వబోమన్నారు. మొత్తం నాలుగు దశల్లో నిధులు విడుదల అవుతుందన్నారు పొంగులేటి. గ్రౌండ్ లెవల్ లో ప్రతి ఇంటిని పరిశీలించే బాధ్యత యువ ఇంజనీర్లదేనన్నారు. ప్రతి సోమవారం అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిధులు రిలీజ్ చేస్తామన్నారు. డబ్బులు రిలీజ్ చేశాక ప్రతి ఇంటిని పరిశీలిస్తామని చెప్పారు.

## మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం

రెండు దేశాలు ఉగ్రవాదం తగదని నమ్ముతున్నాయి. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు అని ప్రదాని తెలిపారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో



సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం అని మోదీ పునరుద్ఘాటించారు. ఇటీవల బిహార్‌లో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ పహల్గాం దాడి గురించి ప్రస్తావిస్తూ గట్టి హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా అని అన్నారు.ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టు-ముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కో రాక సందర్భంగా ఆయనతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్య్రం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్లు ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ -ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాం.. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచామని అన్నారు.

## కవితతో 20 ఏళ్ల స్నేహం.. నందమూరి అలేఖ్య ఎమోషనల్ పోస్ట్!

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో తనకున్న స్నేహంపై నందమూరి అలేఖ్య పోస్టు**

**తమ స్నేహానికి 20 ఏళ్లు పూర్తయ్యాయని, బంధం మరింత బలపడిందని వెల్లడి**

**ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తమ స్నేహం చెక్కుచెదరలేదన్న అలేఖ్య**

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో తనకున్న అనుబంధం గురించి దివంగత నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి సామాజిక మాధ్యమ వేదికగా చేసిన ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. తమ స్నేహం రెండు దశాబ్దాలుగా కొనసాగుతోందని, ఈ ప్రయాణంలో తమ బంధం మరింత బలపడిందని ఆమె తన పోస్ట్ ద్వారా వెల్లడించారు. కవితతో కలిసి దిగిన ఓ ఫోటోను కూడా ఆమె పంచుకున్నారు. గత 20 సంవత్సరాలుగా కవితతో తనకు మంచి స్నేహం ఉందని అలేఖ్య తెలిపారు. ఈ కాలంలో ఎన్ని ఆటుపోట్లు, చిన్నపాటి మనస్పర్థలు ఎదురైనప్పటికీ, తమ స్నేహ బంధం మాత్రం చెక్కుచెదరలేదని ఆమె పేర్కొన్నారు. కవిత పట్ల తనకు ఎంతో అభిమానం ఉందని, ఇద్దరూ ఎంతో కలిసిమెలిసి ఉంటామని



అలేఖ్య చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో కూడా తమ స్నేహం ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నట్లు ఆమె తన పోస్ట్ లో వివరించారు. ఈ పోస్టు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ పోస్ట్‌పై భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వారి స్నేహాన్ని ప్రశంసిస్తూ, కలకాలం ఇలాగే ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు మాత్రం, నందమూరి అలేఖ్య బీఆర్ఎస్ పార్టీకి దగ్గరవుతున్నారా అనే కోణంలో తమ అభిప్రాయాలను వ్యాఖ్యల రూపంలో వ్యక్తం చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆలస్యం

## సన్నం బియ్యం పంపిణీపై మంత్రి పొన్నం వెల్లడి

## హిమాయత్ నగర్‌లో బియ్యం పంపిణీ ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్లే హైదరాబాద్‌లో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ఆలస్యమైందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో పౌరసరఫరాల దుకాణం 602లో లబ్ధిదారులకు సన్న బియ్యం ఆయన సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం నారాయణగూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. భారతదేశంలో మొదటిసారి ధనవంతుడు, పేదవాడు అనే తేడా లేకుండా.. అందరూ సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉగాది పండగ నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని.. ఈ పథకం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఎన్నికల కోడ్ వల్ల ఏప్రిల్ నెలలో సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లోని 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. కనీసం



మార్పులు చేర్పులు కూడా చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే, ప్రజా వాణి అప్లికేషన్, రెగ్యులర్‌గా ఎమ్మార్వో ఆఫీస్‌ల నుంచి వచ్చిన అప్లికేషన్‌ల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధిపై ముందుకు వెళ్తామన్నారు. హైదరాబాద్ ప్రజలు ఈ సన్న బియ్యం పథకాన్ని ఉపయోగించుకొని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.



## వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం

### పలుచోట్ల నీట మునిగిన పంటలు

**ఖమ్మం,(క్రైమ్ మిర్రర్):** రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తుంటే .. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటాల కోసం రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి వడ్లు కాంటా పెట్టకపోవడంతో ఆరిన వడ్లు మళ్లీ.. తడుస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంటాలు పెట్టించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సెంటర్లు ఏర్పాటుచేసి కాంటాలు పెట్టేలోపే వాన పడడంతో ఇబ్బందులు తలెత్తాయని అన్నారు.. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల కాంటాలు పెట్టడం ఆలస్యం అయ్యింది. కాంటాలు చేయటంలో ఎక్కడా ఆలస్యం చేయడం లేదన్నారు. సకాలంలో కాంటాలు పెట్టి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..' అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు-వచ్చిన ఈదురుగాలి, వర్షం నేలపాలు చేశాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

## పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్ల కుంభకోణం

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హస్తం ఉందని విమర్శించారు. రైతులు క్వింటాకు రూ.2వేలు నష్టపోయారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నాడు మీడియాతో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రైతు దగ్గర క్వింటాల్ పత్తిని రూ.5వేలకు కొనుగోలు చేసి... బ్రోకర్లు రూ.7 వేలకు పైగా దండుకున్నారని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులు పత్తి రైతులను మోసం చేశారని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయటంతోనే.. రైతులు నష్టపోయారని చెప్పారు. కేవలం 20శాతం మంది రైతులే సీసీఐకు పంటను అమ్ముకున్నారని అన్నారు. మిగిలిన పంటను కాంగ్రెస్ నేతలు సిండికేట్‌గా ఏర్పడి.. సీసీఐకు అమ్ముకున్నారని ఆరోపణలు చేశారు. దీపావళి సందర్భంగా.. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సీసీఐ అధికారులు, ట్రేడర్ల మధ్య జరిగిన రహస్య సమావేశంలో ఈ కుంభకోణానికి బీజం పడిందని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణలు చేశారు.

## బడుగువర్గాల ఆశాజ్యోతి దామోదరం

### 7న సంజీవయ్య వర్ధంతి వేడుకలు: విహెచ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బడుగు బలహీనవర్గాలకు చెందిన నేత దామోదర సంజీవయ్య అని మాజీ ఎంపి వీ. హనుమంతురావు కొనియాడారు. శనివారం నాడు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మే 7వ తేదీన దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడానికి పార్టీ ముఖ్య నేతలు అంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహా ఆవిష్కరణ కోసం అదే రోజు వారి గ్రామానికి వెళ్తున్నానని తెలిపారు. సొంత ఇల్లు లేని ఏ-కై-క ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో బలహీన వర్గాల కోసం దామోదర సంజీవయ్య ఎనలేని కృషి చేశారని ఉద్ఘాటించారు.




## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కులగణన అంతా తప్పుల తడక వ్యవహారం
- మండిపడ్డ ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ..ప్రజల ఆకాంక్ష మేరకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుడు కులగణన అని విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే కులగణన అనే మాట మాట్లాడారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మొట్టమొదటి కులగణన 1931లో జరిగిందని ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. ముస్లింలని బీసీ జాబితాలో చేర్చడం అంటే నిజమైన బీసీలను మోసం చేయడమేనని అన్నారు. 2026లో డీ లిమి-టె-షన్‌కి వెళ్తున్నామని అన్నారు. బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు. జనగణనతో పాటు-కులగణన చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక గొప్ప సంకల్పమని అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక పేద కుటు-ంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటు-గా ఎంపీలకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కోటాను కల్పించాలని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.

## గృహనిర్మాణశాఖకు మంచి పేరు తేవాలి: పొంగులేటి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** గృహ నిర్మాణ శాఖకు మంచి పేరు తేవాలని ఇంజినీర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఎక్కడ తప్పు జరగకుండా చూసే బాధ్యత ఇంజినీర్లదే అన్నారు. న్యాక్‌లో 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతి పొందిన వారికి మంత్రి ఆర్డర్ కాపీలు అందజేసి మాట్లాడారు. తప్పు జరిగిందని చెబితే చాలు.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. టోల్‌ఫ్రీ నెంబర్ ఇస్తాం.. దానికి ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చు. నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు. ఇళ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత వాడుతున్నాం. ఫేజ్-1 నుంచి ఫేజ్-4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలి. అర్హులను ఎంపిక చేసేటప్పుడు అన్ని విషయాలూ పరిశీలించాలి. ఇళ్ల నిర్మాణంలో చిన్న ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదని పొంగులేటి తెలిపారు.



## గొర్రెల స్కామ్ నిందితులను వదలం: సీతక్క

**మహబూబాబాద్,(క్రైమ్ మిర్రర్):** గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్కీముల పేరుతో స్కాములు చేసిన వారిని వదలమని మంత్రి సీతక్క హెచ్చరించారు. గొర్లు, చేపల పథకంలో సహా ఎందులో అవినీతి జరిగినా వదలమని అన్నారు. శనివారం కొత్తగూడ మండలం బత్తులపల్లిలో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా



మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ స్కీములో డబ్బులు తీసుకున్న వారిని ముక్కుపిండి వసూల్ చేస్తామని అన్నారు. తమ ప్రభుత్వంలో ఈ గొర్రెల పథకాన్ని వినూత్నగా అమలు చేస్తామని ప్రకటించారు. రామప్ప వరల్డ్ హెరిటేజ్ కాబట్టి ప్రపంచ దేశాల సుందరీమణులను ఆహ్వానిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో దారుణ ఘటన.. బాలుడిపై యువతి లైంగికదాడి

**నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**బాధితుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో వెలుగులోకి షాకింగ్ ఘటన**

హైదరాబాద్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల మైనర్ బాలుడిపై 28 ఏళ్ల యువతి పలుమార్లు లైంగికదాడికి పాల్పడింది. నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్ లో నివాసం ఉండే 28 ఏళ్ల ఓ యువతి... తన ఇంటి పక్కన ఉండే 16 ఏళ్ల బాలుడితో పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత తన ఇంటికి పిలిచిన ఆమె బాలుడిని మాయమాటలు చెప్పి లోబరుచుకుంది. అలా పలుమార్లు తన ఇంట్లోనే మైనర్‌పై ఆమె లైంగికదాడికి పాల్పడింది. ఈ విషయం బయటకు చెబితే తనపై అత్యాచారం చేశావని చెబుతానంటూ బాలుడిని బెదిరించింది. దాంతో భయపడిపోయిన బాలుడు ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. తాజాగా మరోసారి అతనిపై లైంగిక దాడికి పాల్పడిందామె. అలాగే అసభ్యకరమైన పనులు చేయాలంటూ బాలుడిని బలవంతం చేసింది. రోజురోజుకూ ఆమె వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేకపోయిన మైనర్... తనపై గతకొంతకాలంగా యువతి చేస్తున్న దారుణాన్ని పేరెంట్స్‌కు చెప్పాడు. దాంతో బాలుడి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎడిటోరియల్



అనుకున్నట్టే అయింది. సోమవారం కెనడాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి విజయకేతనం ఎగరేయబోతున్నదని ఫలితాల సరళి తెలియజెబుతోంది. 343 స్థానాలున్న పార్లమెంటులో ఆ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తుందా, లేక వేరే పార్టీల ఆసరా కావాల్సివస్తుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలిపోతుంది. గత మూడేళ్లుగా అధికార లిబరల్ పార్టీ అసంతృప్తిని మూట గట్టుకుంది. ఈసారి దాని ఓటమి ఖాయమని అన్ని సర్వేలూ జోస్యం చెప్పాయి. మొన్న జనవరిలో సైతం కన్సర్వేటివ్‌ల కన్నా లిబరల్స్ 20 పాయింట్లు వెనకబడివున్నారు. ఈ దశలో అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు కావటం, ఆయన మతిమాలిన ప్రకటనలు, ఎడాపెడా సుంకాల విధింపు లిబరల్ పార్టీకి వరంలా మారాయి.

ఇతరేతర సమస్యలవీ మాయమై కెనడాను అమెరికా కబళిస్తుందన్న భయాందోళనలు ఆవహించి కన్సర్వేటివ్ పార్టీని కాదని జనం ఎప్పటిలా లిబరల్ పార్టీవైపే మొగ్గు చూపారు. ప్రధాని పదవి నుంచి జస్టిన్ ట్రూడో తప్పుకోవటం కూడా లిబరల్స్‌కు కలిసొచ్చింది. ఆయన స్థానంలో గత నెల మొదట్లో ప్రధానిగా వచ్చిన మార్క్ కార్నీ చకచకా చక్రం తిప్పారు. ట్రంప్‌తో సాన్నిహిత్యమున్న కన్సర్వేటివ్ పార్టీ వస్తే దేశాన్ని అమెరికా పాదాక్రాంతం చేయటం ఖాయమన్న ప్రచారం పనికొచ్చింది. కన్సర్వేటివ్ పార్టీ జాతకం తలకిందులైంది. ప్రపంచ సంపన్న రాజ్యాల్లో ఒకటిగా, అమెరికా సన్నిహిత మిత్ర దేశంగా, వాణిజ్య భాగస్వామిగా దశాబ్దాలపాటు వెలుగులీనిన కెనడా కొన్నాళ్లుగా కష్టాల్లో కూరుకుపోయింది. అయిదేళ్ల నాడు విరుచుకుపడిన కోవిడ్ వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జీవనవ్యయం అపారంగా పెరిగింది. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ఇళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. నగరాల్లో అద్దెలు విపరీతంగా

## కెనడాలో లిబరల్స్‌కు పట్టం

పెరగటంతో శివారు ప్రాంతాలకు జనం తరలిపోయారు.

గృహ కొనుగోలుదారులు ఆ ఆలోచనను వాయిదా వేసుకున్నారు. ఇళ్లు లేని పౌరుల సంఖ్య పెరుగుతూ పోయింది. వీటన్నిటి పర్యవసానంగా పుట్టుకొచ్చిన సామాజిక అశాంతి మాదకద్రవ్యాల వాడకాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లింది. దాంతోపాటే నేరాల సంఖ్య ఎక్కువైంది. నిజానికి ఇది కెనడాకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. సంపన్న దేశాలన్నీ ఈ మాదిరే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కానీ కెనడా పౌరులు దీన్నంతటినీ లిబరల్ పార్టీ చేతగానితనంగా పరిగణించారు. గత మూడేళ్లుగా కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు పియర్ పొయ్‌లేవ్ దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం తమకే సాధ్యమని ప్రచారం చేశారు. ఆవరించిన ఈ సంక్షోభం బహుశా చాలా దేశాల మాదిరే కెనడాలో కూడా మిత వాదపక్షాన్ని అందలం ఎక్కించివుండేది. కానీ ట్రంప్ అధిక సుంకాలు విధించటం, కెనడాను 51వ రాష్ట్రంగా విలీనం చేసుకోవటం ఖాయమని తరచు చెప్పటం కన్సర్వేటివ్‌ల ఆశల్ని అడియాసలు చేసింది. పౌరుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. వారు గెలిస్తే అదే జరగొచ్చునన్న సంశయం బలపడింది. తమ సహజ వనరులు, ఆర్థిక సంపద దోచుకోవటానికి అమెరికా తహతహలాడు తున్నదని, దీన్ని నిలువరించగల పార్టీ లేకుంటే ట్రంప్ అన్నంతపనీ చేస్తారని వోటర్లు భావించారు. ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వాటి ధరలు దిగొచ్చేలా చేస్తామని రెండు ప్రధాన పక్షాలూ వాగ్దానం చేశాయి. కొత్త భవనాల నిర్మాణంపైవున్న ఆంక్షల్ని ఎత్తేస్తామని కన్సర్వేటివ్‌లు హామీ ఇస్తే... ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామని కార్నీ వాగ్దానం చేశారు. అమెరికా నిజ స్వరూపం తెలిసింది గనుక ఇకపై భద్రతకు ఆ దేశంపై ఆధారపడకుండా సొంతంగా సైన్యాన్ని రూపొందించుకోవాలని రెండు పార్టీలూ ప్రతిపాదించాయి.

అధిక సుంకాల విషయంలో కూడా ఆ రెండు పక్షాలదీ ఒకే మాట. కెనడా ఎగుమతుల్లో 80 శాతం అమెరికాకే చేరతాయి. అధిక సుంకాలు విధిస్తే కెనడా తీవ్రంగా నష్టపోతుంది. తాము కూడా అధిక సుంకాల ప్రక్రియ మొదలెట్టామని,దాంతో ఆ దేశం గత్యంతరం లేక చర్చలకు దిగొచ్చిందని కార్నీ చెప్పారు. అయితే కన్సర్వేటివ్‌లు ఇంత బలంగా ట్రంప్‌పై విరుచుకుపడలేకపోయారు. ఇక అధిక వలసలపై కూడా ప్రజల్లో ఆగ్రహం వుంది. లిబరల్స్ ఏలుబడిలో వలసలు పెరిగాయని వారు నమ్మారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో కొత్తగా ఖనిజాలు, శిలాజ ఇంధనాల వెలికితీతను నిలిపేయటంవల్ల ఆ రంగాల్లో ఉపాధి అవకా శాలు అడుగంటాయని, తామొస్తే దీన్ని సరిదిద్దుతామని కన్సర్వేటివ్‌లు హామీ ఇచ్చారు. నిజానికి ఈ సమస్యలే అమెరికాలో మితవాద రిపబ్లికన్ పార్టీని అందలం ఎక్కించాయి. కానీ ట్రంప్ రాకతో ఆ సమస్యలన్నీ మరుగునపడి కెనడాలోని మితవాద పక్షాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి.కార్నీ ఏలుబడిలో మనతో కెనడా సంబంధాలు మెరుగుపడతాయన్న అభిప్రాయం అందరిలో వుంది. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించే దారి దొరక్క, ఆ అసంతృప్తిని కప్పిపుచ్చటానికి ట్రూడో భారత్‌తో కోరి వైరాన్ని తెచ్చుకున్నారు. తీరా జగ్‌మీత్ సింగ్ ఆధ్వర్యంలోని ఖలిస్తానీ అను కూల న్యూడెమాక్రటిక్ పార్టీ(ఎన్‌డీపీ)కే ఈసారి దిక్కులేకుండా పోయింది.

---

**మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. వారు లేనిదే పరిశ్రమలు లేవు..జీవనం లేదు.. అయినా ఏటా మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం చిత్తశుద్ధి కానరావడం లేదు. వారిని నేటికి బానిసలు గానే చూస్తున్న తీరు దారుణం. కార్మిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.**

చట్టాలు పరిశ్రమల యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. కనీస వేతనాలు, అమలు కావడం లేదు. పనిదినాలు, పనిగంటలు అన్నవి లేకుండా పోతున్నాయి. దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్న కారణంగా, కార్మికసంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారింది.



## కార్మికుల స్వేదానికి వెలకట్టని చట్టాలు !

కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టినా...నిత్యం వారికే అన్యాయం జరుగుతోంది. వారినే యాజమాన్యాలు చులకన చేస్తున్నాయి. ఏటా మేడేలు జరుపుకుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా కార్పోరేట్ రంగం విస్తరించిన తరవాత కార్మికుల జీవితాలకు, జీతాలకు విలువ లేకుండా పోయింది. ప్రధానంగా పనిదినాలు, పనిగంటలు అన్నవి మృగ్యం అయ్యాయి. నిబంధనల మేరకు అనే పద్ధతి పోయింది. కంపెనీల నిబంధనల మేరకు పనిచేయాల్సి వస్తోంది.

కార్మికచట్టాలు అన్నీ చూడడానికి ఉన్నా, అమలు మాత్రం కావు. ఏవైనా ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు. ఇకపోతే శ్వేదం చిందిస్తూ మిద్దెలు,మేడెలు కడుతున్నా..వారికి కనీసం గూడు ఉండడం లేదు. వారి పిల్లలకు చదువూసంధ్యా దక్కడం లేదు. వ్యవసాయం నుంచి అన్నిరంగాల్లో వారి చెమట లేకుండా ఏ పనీ జరగడం లేదు. సర్వసంపదలు సృష్టించే శ్రామికవర్గం అన్నది గుర్తింపు లేకుండా పోయింది. శ్రమజీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు.కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఉద్యోగాలు తొలగించినా... నోటీసులు ఇవ్వకున్నా కార్మిక సంక్షేమ శాఖ చూసీచూడనట్లుగా ఉంటోంది. ఇకపోతే మరీముఖ్యంగా ఆడవాళ్లు వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమపై అధికారులు వారిని సెక్స్ బానిసలుగా చూస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం దీని ఇంకా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే కార్మికుల పిల్లలకు విద్యా,ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారికి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్థాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసేసి కార్మికులు నోట్లో మట్టికొడుతున్నా కార్మిక చట్టాలు పనిచేయడం లేదు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు. మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్నాయి. యాజమాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్థకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్న యాజామన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే సాధ్యం అయ్యాయి. కానీ

ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల మోచేతి నీళ్లు తాగుతూ..కార్మికులకు ద్రోహం చేస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న ఈ ప్రపంచం, అభివృద్ధి అంతా కూడా కార్మికుల శ్వేదం చిందిస్తేనే సాధ్యం అయ్యిందన్న విషయం మరచిపోతున్నాం. కార్మికవర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు. పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో కార్మికులను బానిసల వలే పని చేయించారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని వుండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురవుతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్‌లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్‌లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్థం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభ మైంది. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలడెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. 1886 చికాగో కార్మికుల పోరాటం,884 అక్టోబర్‌లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్డ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుండి 8 గంటల పని చట్టబద్ధమైన పనిదినంగా వుంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు. ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలని తీర్మానాన్ని రూపొందించింది. అప్పటి నుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపుకుంటోంది. ఆతరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. ఈ అనుభవాను గుర్తించినా రానురాను ఈ ఆధునిక యుగంలో కార్పోరేట్ కంపెనీలన్నీ ప్రభుత్వాలతో కుమ్మక్కయి కార్మికులను అణచి వేస్తున్నారు. ఈ క్రమంలో మరో కార్మికోద్యమానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మేల్కొని అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

---

## పదునైన వ్యూహంతో...

ప్రతీకారం దిశగా ఒక్కో అడుగే పడుతోంది. పహల్గాం సమీపంలో వారం రోజుల క్రితం 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదుల వేటకు రంగం సిద్ధమవుతోంది. దాడి ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా జరగాలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను త్రివిధ దళాధిపతులకు ఇస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తీసుకున్న నిర్ణయం అసాధారణమైనది. దాంతోపాటు జాతీయ భద్రతా సలహా బోర్డు(ఎన్ఎస్ఏబీ)ను బుధవారం పునర్వ్యవస్థీకరించటం కూడా కీలక పరిణామం. 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి సారథ్యంలో ఏర్పాటైన ఈ బోర్డు జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తుందంటు న్నారు. పదునైన వ్యూహం, పక్కా ప్రణాళిక, మెరికల్లాంటి దళాలను కీలక ప్రాంతాల్లో మోహరించటం వగైరాలన్నీ ఇలాంటి సమయాల్లో అత్యంత అవసరం. ఇప్పటికే పహల్గాం మారణకాండను తక్కువ చేసి చూపటానికి పాకిస్తాన్ చేయాల్సిందంతా చేస్తోంది. దాదాపు 45 యేళ్లుగా దాని వ్యూహం ఇదే.

ఒకపక్క ఎల్‌ఓసీలో వరసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, సరిహద్దుల్లో నిఘా రాడార్లు, యుద్ధ సామగ్రి తరలిస్తూ మరోపక్క అమెరికా తదితర దేశాలముందు తన అమాయ కత్వాన్ని చాటుకోవటానికి ప్రయత్నిస్తోంది. మారణకాండ గురించి 'నమ్మదగ్గ సమాచారం' ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పటం ఇప్పటి షెహబాజ్ సర్కార్‌కి మాత్రమే కాదు... కుట్రపూరితంగానో, ఎన్నికల మాటున సైన్యం ప్రాపకంతోనో అధికారాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్న పాక్ అధినేతలందరికీ అలవాటైన విద్య. దీనికి ఎక్కడో అక్కడ అడ్డుకట్ట పడటం తప్పనిసరి. అందుకే ప్రభుత్వ తాజా నిర్ణయం అన్నివిధాలా ఆహ్వానించదగ్గది.

మన సహనాన్ని చేతగానితనంగా, మన సుహృద్భావాన్ని అశక్తతగా భావించటం పాకిస్తాన్‌కు అలవాటైంది. మొన్న జరిగిన మారణకాండ అనంతరం దేశవ్యాప్తంగా ప్రజలందరూ ప్రతీకారేచ్ఛతో రగులుతున్నారు. కేవలం దాన్ని సంతృప్తిపరచటమే అంతిమ లక్ష్యం కారాదు. తాజా దాడిలో పాకి స్తాన్ సైన్యంలో పారా కమాండోగా పనిచేసిన హాషీం మూసా అనే ఉగ్రవాది పాల్గొనటాన్నిబట్టి చూస్తే ఐఎస్ఐ పాత్రవుందని అర్థమవుతోంది. ఇలాంటివి నివారించాలంటే సరిహద్దుల్లో పటిష్టమైన నిఘావుండాలి. దాంతోపాటు వేర్వేరు సమయాల్లో జరిగిన దాడుల స్వభావాన్ని అధ్యయనం చేయాలి.

నిరుడు అక్టోబర్‌లో మధ్య కశ్మీర్‌లో ఏడుగురు కార్మికులను పొట్టనబెట్టుకున్నది మొదలు మొన్నటి పహల్గాం మారణకాండ వరకూ జరిగిన నాలుగు ఉదంతాల్లో కీలకపాత్ర పోషించింది మూసాయే అంటున్నారు. అదే నిజమైతే మన నిఘా వ్యవస్థ సక్రమంగా లేదని భావించాలి. మొన్న విపక్షాలతో జరిగిన సమావేశంలో కూడా కేంద్ర ప్రభుత్వం నిఘా వైఫల్యం ఉన్నదని అంగీకరించింది. కనుక పాకిస్తాన్ ప్రాపకంతో చెలరేగుతున్న ఉగ్రవాదులను గురిచూసి కొట్టటానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టే మన నిఘా వ్యవస్థను కూడా మరింత పటిష్టం చేయాలి.

జవాబుదారీ తనాన్ని నిర్ధారించాలి. ఉగ్రవాదులు మన లోటుపాట్లేమున్నాయో చూసుకునే దాడులకు దిగుతారు. ఆ పని మన నిఘా వర్గాలు చేయగలిగితే ఉగ్రవాదుల్ని నిరోధించటంతోపాటు వారిని చాకచక్యంగా పట్టి బంధించటానికి కూడా వీలవుతుంది. అప్రమత్తత లోపించటంవల్ల నిరాయుధ పౌరుల ప్రాణాలు మాత్రమేకాదు... స్థానికుల జీవిక కూడా దెబ్బతింటుంది. తాజాగా ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో కశ్మీర్‌లోని 50కి పైగా పర్యాటక స్థలాలను మూసివేసినట్టు అధికారులు ప్రకటిస్తున్నారు. అంటే కొన్ని వేల కుటుంబాల ఉపాధి దెబ్బతింటుంది. మున్ముందు తెరిచినా అటువైపు వెళ్లేందుకు పర్యాటకులు జంకుతారు గనుక ఆ రంగం కోలుకోవటానికి చాలా సమయం పడుతుంది.

అన్నిటికన్నా మన నేతలు మాటలూ, చేతలూ అదుపులో పెట్టుకోవటం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం. రెండు పక్షాలు పరస్పరం తలపడుతున్నప్పుడు ఎవరి బలం ఎక్కువన్న దాన్నిబట్టి ఫలితం ఆధారపడి వుండదు. ఎవరు కలిసికట్టుగా ఉన్నారో, ఎవరు మెరుగైన వ్యూహం పన్ను తున్నారో, ఎవరి ఎత్తుగడలు సరైనవో వారినే విజయం వరిస్తుంది. జరిగిన భద్రతాలోపాలకు బాధ్యులెవరో నిర్ణయించాలని అనటం, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరటం వరకూ ఎవరికీ అభ్యంతరం ఉండదు. నిర్మాణాత్మకమైన విమర్శలూ ఆహ్వానించదగ్గవే.

కానీ ప్రధాని చిత్రాన్ని ఒక పార్టీ తప్పుడుగా చిత్రిస్తే, మరొకరు దానికి జవాబుగా విపక్షనేత వెన్నుపోటుకు సిద్ధంగా వున్నట్టు మరో చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నేతల్ని పాకిస్తాన్ పొమ్మంటూ ఉచిత సలహా ఇచ్చారు. 26 మంది అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులను ఏరిపారేయటానికి ఏం చేయాలన్న అంశంలో మన భద్రతా వ్యవస్థ తలమునకలై వుంది. ఈ పరిస్థితుల్లో ఐక్యతను చాటి ఆదర్శంగా వుండాల్సిన నాయకులు దిగజారుడు పోస్టులతో అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నారు.

ఇదంతా దేశభక్తి అనే భ్రమలో వీరు కాలక్షేపం చేస్తున్నారు. వీరిని చూసి అనుచరగణాలు మరింత రెచ్చిపోతున్నాయి. మతం పేరిట, ప్రాంతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి. ఫలితంగా వేర్వేరు ప్రాంతాల్లోని కశ్మీరీ చిరువ్యాపారుల పైనా, విద్యార్థుల పైనా దాడులు జరుగుతున్నాయి.

# ఈ నెల 5వ తేదీ నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



గండిపేట్(క్రైం మిర్రర్): ఈ నెల 5వ తేదీ(సోమవారం) నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్నామని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య అన్నారు. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనిలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం గురించి వివరించారు. దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టనున్నామన్నారు. రైతులు, రైతు కూలీలు, ఉపాధ్యాయులు, అభ్యుదయ రైతులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వ్యవసాయ విద్యా ప్రవేశాల్లో రైతు బిడ్డలకు 40 శాతం ప్రత్యేక కోటా ఉందని, ఈ కోటా నుంచి ఈ ఏడాది నుంచి రైతు కూలీల పిల్లలకు 15 శాతం కోటా సీట్లు ఇస్తామని జానయ్య వివరించారు. భవిష్యత్ తరాలకు ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ ప్రాంతాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి కోరారు. వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవుతుందని వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమ వివరాలను డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, ఈ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ చల్లా వేణుగోపాల్ రెడ్డి వివరించారు. తెలంగాణ రైతాంగానికి ప్రధానమైన సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నడుం బిగించింది. దీనిలో భాగంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే వినూత్న కార్యక్రమాన్ని మే 5వ తేదీ (సోమవారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనుందన్నారు. జూన్ 13వ తేదీ వరకు రాష్ట్రంలోని సుమారు 1200 రెవిన్యూ గ్రామాల్లో 200 శాస్త్రవేత్తల బృందాలు పర్యటించనున్నాయన్నారు. దక్షిణ వ్యవసాయ మండలంలో సుమారు 100 శాస్త్రవేత్తల బృందాలు, ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 చొప్పున శాస్త్రవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయన్నారు. పని దినాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ ముందే ఎంపిక చేసుకున్న గ్రామంలోని రైతు వేదిక లేదా మరో ఇతర ప్రదేశంలో శాస్త్రవేత్తల బృందం రైతాంగంతో సమావేశం అవుతుందన్నారు. ప్రతి బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొంటారన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేస్తారన్నారు. యూరియా వాడకం తగ్గించడం, అవసరమైన మేరకే రసాయనాలని వినియోగించి నేలసారాన్ని పరిరక్షించడం, సాగు నీటి సమర్థ వినియోగం, పంటల మార్పిడి, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ తదితర ముఖ్యమైన అంశాల్లో శాస్త్రవేత్తల బృందం రైతాంగానికి అవగాహన కల్పించనుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్ లు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పూర్తి భాగస్వాములవుతాయన్నారు. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, సహ పరిశోధనా సంచాలకులు, కళాశాలల డీన్లు ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలు, విద్యార్థులకి క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. అదేవిధంగా అటు రైతాంగానికి అనేక ప్రధాన సాగు అంశాలపై శాస్త్రవేత్తల ద్వారా సాగు మెళకువలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంల పై అవగాహన పెంచుకోవడానికి వీలు అవుతుంది. అందరమూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాన్నారు.

# హైదర్షాకోట్‌లోని వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించిన డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీలత





గండిపేట్(క్రైం మిర్రర్): శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీలత శనివారం హైదర్షకోట్‌లోని వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించారు. వృద్ధుల పరిస్థితులను స్వయంగా గమనించిన ఆమె, ఆశ్రమ వాసులతో చర్చించి వారి అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. వృద్ధుల మౌలిక వసతులు, ఆరోగ్య సంరక్షణ, ఆహారం, మరియు స్వచ్ఛత వంటి అంశాలపై అవగాహన కలిగి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీడీపీఓ కవిత మాట్లాడుతూ... ప్రస్తుతం సాంకేతిక శ్రేణి ఎంత ముందుకెళ్లినా, మానవీయ విలువలు నిలబెట్టుకోవడమే ముఖ్యమైంది. వృద్ధులు మనకు మార్గదర్శకులు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఐసీడీఎస్ ద్వారా వారు అవసరమైన సేవలు అందుకునేలా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. అదే విధంగా వారంతా ఆశ్రమం పర్యటించి వృద్ధులతో మమేకమయ్యారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు ఈ సందర్శనపై హర్షం వ్యక్తం చేశారు. అధికారుల సానుభూతి, చొరవ వృద్ధులలో కొత్త ఆశను నింపిందని వారు పేర్కొన్నారు. శాసనోన్నతాధికారులతో కలిసి వృద్ధాశ్రమ అభివృద్ధికి మరింత పటిష్ట చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.ఈ సందర్శనలో డిడబ్ల్యుఓ ఆఫీసర్ స్వాతి, సూపర్వైజర్ పద్మజ, అంగన్వాడీ టీచర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం బహూకరణ

**సంస్థాన్ నారాయణపూర్, మే 04(క్రైమ్ మిర్రర్):** సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలోని స్వస్తిక్ గార్డెన్లో, టిఎన్ఆర్ న్యూస్ ఛానల్ చైర్మన్ మొగిలిచర్ల నాగరాజు - సింధు దంపతుల వివాహ వేడుకలో, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని, బాలు టీవీ కేబుల్ ఛానల్ చైర్మన్ ఉప్పల పెల్లి బాలక్రిష్ణ, ఏటీవీ ఇండియా ఛానల్ చైర్మన్ మొహమ్మద్ అలీ పాల్గొని వివాహ శు భాకాంక్షలు తెలియజేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లి అనేది రెండు మనసులు ఒప్పందం మాత్రమే అని స్వర్గం, నరకం లో ఎక్కడ రాసి ఉండదని వారు అన్నారు.

## నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, భారతీయ జనతా పార్టీ మర్రిగూడ మండల శాఖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ, వారి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారి నిర్ణయాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఓబిసి మోర్చా కోశాధికారి ఆకారపు రమేష్ ముదిరాజు, పిట్టల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు, మర్రిగూడ మండల పార్టీ అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్ నాయక్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దేశాన్ని 78 ఏళ్లు పరిపాలించి కులగణన పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ఏ కులాన్ని కూడా సరైన న్యాయం చెయ్యక అధికార దాహంతో, ఈ రాష్ట్రాన్ని ఓసిల చేతులో పెట్టి, బీసీలకు తీరని అన్యాయం చేసిందని, ఈ రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పరిపాలించిన బారాస ప్రభుత్వం సమగ్ర సర్వే అని పేరు పెట్టి, ఈ రాష్ట్ర ప్రజలను నిలువునా దోచుకున్నారే తప్ప, ఏ కులానికి ఏ అధికారాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. బీసీల పట్ల ప్రేమ కలిగిన నరేంద్ర మోడీ ఈ దేశంలో ఉన్న బీసీలకు రాష్ట్రానికి ధారాదత్తం చేయాలనే ఉద్దేశ్యంతో, కులగణనను చేపటడం గొప్ప త్యాగమని, బీసీల పట్ల ఆయన ఆరాధ్య దైవమని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో పందులు రాములు శ్రీనివాస్ రావు, గ్యార యాదగిరి, %అ%జిల్లాకులు సైదులు, సిలివేరు వెంకటేష్, ప్రదీప్ రెడ్డి, నరసింహ చారి, పంగ యాదయ్య, రావుల రమేష్, వడ్డేమాన్ సైదులు, సాలర్జంగ్, యశ్వంత్, మహమ్మద్ సయ్యద్, లచ్చిరాం, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు..



## రాజేంద్రనగర్‌లో కోట్లాధి రూపాయలను అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నాం

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

గండిపేట్(క్రైం మిర్రర్): కోట్లాధి రూపాయల నిధులను మంజూరు చేయిస్తు ప్రజల అవసరాలను తీరుస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ సర్వరెడ్డి జంక్షన్, శివరాంపల్లి వద్ద రూ.15.80 లక్షలతో సీసీ రోడ్డు పనులను, ఉప్పర్‌పల్లిలో రూ.10.50 లక్షలతో అయ్యప్ప స్వామి టెంపుల్‌కు అప్రూచ్ రోడ్డు పనులను, 38 లక్షలతో అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి పరిచేందుకు కోట్లాధి రూపాయలను వెచ్చిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, పడమటి శ్రీధర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్,నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మణికొండలో వాసవి మాత అమ్మవారి గుడి ఏర్పాటుకు తనవంతు కృషి అందిస్తా

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ కార్తీక్‌రెడ్డి





గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండలో ఆర్యవైశ్య ఆఫీసర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా బొడ్డు శ్రీధర్, మహిళా విభాగం అధ్యక్షులు శ్రవంతిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ కార్తీక్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్, వ్యాపారవేత గందె సుధాకర్‌గుప్తాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ మణికొండలో వెయ్యి గజాలకు తగ్గకుండా వాసవి మాత అమ్మవారి గుడి కోసానికి భూమి కేటాయించడానికి తనవంతుగా మద్దతు ప్రకటిస్తానన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కూడా ఇప్పటికే వాసవి మాత దేవాలయానికి సహకరించడం జరిగిందన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ తనవంతుగా కూడా ప్రభుత్వంతో మాట్లాడి ఆర్యవైశ్యులకు మణికొండలో వాసవి మాత అమ్మవారి గుడి సాధన కోసం ప్రభుత్వంతో కూడా మాట్లాడి ఇప్పిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక అమ్మవారి గుడి కట్టాలని సంకల్పం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, అవపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో భార్యభర్తల బలవన్మరణం

### సంఘటనలో భార్య మృతి, భర్త పరిస్థితి విషమం



గండిపేట్(క్రైం మిర్రర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యల కారణంగా భార్యభర్తలు ఇద్దరు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రమేష్(45), రాజేశ్వరి(35) భార్యభర్తలు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లోని హార్పిక్‌ను తాగి బలవన్మరణానికి యత్నించారు. ఈ సంఘటనలో భార్య రాజేశ్వరి మృతి చెందింది. కడుపులో పేగులు కాలిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. భర్త రమేష్ పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## మణికొండ వీధి వ్యాపారులతో బీఆర్ఎస్ నాయకుల చిట్‌చాట్

గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం వీధివ్యాపారులతో చిట్‌చాట్ నిర్వహించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అధ్యక్షతన వీధివ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల చట్టం గురించి పూర్తి అవగాహన కల్పించారు. ప్రభుత్వాల ద్వారా వీధి వ్యాపారుల బ్రతుకుదెరువు, భద్రత కల్పించడం, చట్టబద్ధత కల్పించడం అన్ని విషయాలపై కూలకంశంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, జైరామ్, భానుచందర్, సుమనళిని, బెన్నీ, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, ఎస్.రేఖ, అశ్వక్ ఆలీ, ఆరిఫ్‌మహ్మద్, ప్రవీణ్ తదితరులున్నారు.

## ఆడ బిడ్డ పెళ్లికి అండగా ఉంటాము

### పటేల్ చెరువు తాండ మాజీ సర్పంచ్ శాంతి తులసిరాం



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:ఆడ బిడ్డ పెళ్లికి అండగా ఉంటామని పటేల్ చెరువు తాండ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శాంతి తులసిరాం అన్నారు.వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని పటేల్ చెరువు తాండ గ్రామ పంచాయతీ చెందిన విస్లావత్ శాంతి బాయ్ బాబ్యనాయక్ కుమార్తె జ్యోతి వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ శాంతి తులసిరాం ఒక క్వింటాలు బియ్యం 15 కేజీల మంచి నూనె శనివారం కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆడ బిడ్డ పెళ్లికి అండగా ఉంటామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో తండా పెద్దలు నేనావత్ చందర్,నేనావత్ ఠాగూర్ సింగ్,ఎన్ రవి,విస్లావత్ లక్ష్మీబాయి,రామచందర్, విస్లావత్ సురేష్,గణేష్,పటేల్ చెరువు తండా మాజీ వార్డ్ నెంబర్ లక్ష్మీబాయి, తండావాసులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ బోనస్‌కు కన్నేసిన దళారులు

### ఆంధ్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న ధాన్యం లారీలు పట్టివేత

### డీఎస్పీ రాజశేఖర్ రాజు వెల్లడి

**మిర్యాలగూడ, క్రైమ్ మిర్రర్ మే 3 :** తెలంగాణలో ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్‌ను లక్ష్యంగా చేసుకొని, ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఏడు ధాన్యం లారీలను పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడిన డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు ఈ విషయాన్ని వెల్లడించారు."తెలంగాణలో ఎంఎస్‌పీతో పాటు బోనస్ ఉండటంతో దళారులు, మధ్యవర్తులు ఆ ప్రోత్సాహాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వారు ఆంధ్రప్రదేశ్ నుంచి ధాన్యాన్ని లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు," అని డీఎస్పీ తెలిపారు.మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని వాడపల్లి, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 100-150 లారీలు తిరస్కరించామని, అయినప్పటికీ కొన్ని మార్గాల్లో అక్రమ రవాణా కొనసాగుతోందన్నారు.శనివారం వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఆరు లారీలు, సుమారు 2,200 బస్తాల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. "ప్రభుత్వాన్ని మోసం చేయాలనే ఉద్దేశంతో అక్రమ రవాణాకు పాల్పడిన వారి మీద కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.ఈ సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్డీ ప్రసాద్, ఎస్ఐలు లక్ష్మయ్య, బిక్షం, సంజీవరెడ్డి, ఏఎస్ఐ రామలునాయక్ పాల్గొన్నారు.




## ఆధ్యాత్మికతకు ఆదర్శంగా ఆదర్శ కాలనీ హనుమాన్ చాలీసా ఘనంగా పారాయణం, భక్తి గీతాలతో మార్మోగిన దేవాలయ ప్రాంగణం



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ) : రాజేంద్రనగర్ సర్కిల్, మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో శనివారం భక్తిశ్రద్ధలతో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, పంచాయతన శివాలయం ఆవరణలో 4వ వారం హనుమాన్ చాలీసా పారాయణం భవ్యంగా నిర్వహించబడింది. ప్రతి శనివారంనాడు ఈ పారాయణం జరగడం ఆనవాయితీగా మారింది. ఈ కార్యక్రమం ద్వారా కాలనీలో ఆధ్యాత్మికతను విస్తరించడమే లక్ష్యంగా కమిటీ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామివారికి తమ శ్రద్ధను అర్పించారు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మికత నిండిన వాతావరణం నెలకొంది. పారాయణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కూడా చేపట్టారు. మహిళలు, యువత, చిన్నారులు అందరూ పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు భక్తుల మనోబలాన్ని పెంచడమే కాదు, సమాజంలో సానుకూల శక్తిని వ్యాపింపజేస్తాయి. ప్రతి శనివారం వారం ఒకసారి నిర్వహించే ఈ పారాయణం ప్రజల నుంచి విశేష స్పందన పొందుతోంది. భవిష్యత్తులో కూడా ఇంకా విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టనున్నాం అని వారు తెలిపారు. కమిటీ సభ్యులు, స్తానిక నాయకులు, భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములయ్యారు. ఆలయ అభివృద్ధి, శుభ్రత, భక్తుల సౌకర్యాల పరంగా కమిటీ అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సామాజిక సమైక్యతకు ఆలయం కేంద్ర బిందువుగా మారుతోంది. ఇటువంటి కార్యక్రమాల ద్వారా కాలనీలో సద్భావం, భక్తి, ఏకత్వం మరింత బలపడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## భాస్కర్ రావు అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### ప్రజా ఆస్తులు వ్యక్తిగత ప్రయోజనాలకు వాడటం అసహ్యం .. నూకల వేణుగోపాల్ రెడ్డి

### మినీ రవీంద్రభారతి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారకం .. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజల ఆస్తి కాంగ్రెస్ నేతల వ్యాఖ్య





**మిర్యాలగూడ, క్రైమ్ మిర్రర్ మే 3:** బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు తన హోదాను దుర్వినియోగం చేసి చేపట్టిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలపై ప్రభుత్వం నిష్పాక్షికంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం మినీ రవీంద్ర భారతి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజల ఆస్తి. అది కేసీఆర్,భాస్కర్ రావు వ్యక్తిగత స్వత్తు కాదు" అని స్పష్టం చేశారు. మినీ రవీంద్రభారతి నిర్మాణం పూర్తిగా 2006 నుంచి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల నిధులత్తో సాగిందని, మొత్తం రూ.9.30 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ ఆడిటోరియం నిర్మాణానికి టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మెప్పించేందుకు భాస్కర్ రావు కళాభారతికి ముందు ఆయన పేరును పెట్టారని, దీని వెనక బినామీలకే లాభం చేకూర్చే ఉద్దేశమే ఉందని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు ఇటీవల కేసీఆర్ పేరు తొలగించడాన్ని ప్రజాస్వామ్యానికీ, నిజాయితీకి నిదర్శనంగా అభివర్ణించారు.ఈ సమావేశంలో పాల్గొన్న నల్గొండ డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు మాట్లాడుతూ, ప్రజా ఆస్తులను స్వలాభం కోసం వాడే భాస్కర్ రావు వంటి నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పార్టీ ఆస్తిగా మలచడమన్నది ప్రాథమిక ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమని పేర్కొన్నారు.2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన భాస్కర్ రావు నేడు అదే పార్టీపై విమర్శలు చేయడం దౌర్భాగ్యకరం, అని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్చలేకే బీఆర్ఎస్ నేతలు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు.సమావేశంలో మాజీ కౌన్సిలర్లు, ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జులు దేశిడి శేఖర్ రెడ్డి, పందిరి అనిత, కొమ్మన నాగలక్ష్మి, క్రికెటర్ జానీ, రవినాయక్, రామకృష్ణ, జావేద్, అమృతారెడ్డి, యాదగిరి, ఎండీ.మోయిజ్, ఎండీ.అబ్దుల్లా, ఉబ్బపల్లి కాశయ్య, శ్రీనివాస్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ అజహరుద్దీన్, పట్టణ అధ్యక్షుడు పర్వేజ్, ఫారూఖ్ మొహమ్మద్, బాసాని గిరి, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, సోషల్ మీడియా కన్వీనర్ పాదూరి శరత్, ఆలగడప గిరిధర్, బండి యాదగిరిరెడ్డి, గణేష్ పహాడ్ మాజీ సర్పంచ్ నాగునాయక్, గోదాల జానకిరామ్ రెడ్డి,మేకల శ్రీనివాసరావు, గుంజ శ్రీను, నాగునాయక్, బూడిద సైదులు, గొట్టిముక్కల లక్ష్మణ్, గోవర్ధన చారి, చక్రి అవుట శీను, విష్ణు, బెజ్జం నాగరాజు, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహావిష్కరణ వాల్పోస్టర్ను రిలీజ్ చేసిన అంబేద్కర్ సంఘ నాయకులు

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్ర ఆవిష్కరణ వాల్ పోస్టర్ ను శనివారం మండల దళిత యువశక్తి శక్తి యువజన సంఘం నాయకులు అంబేద్కర్ సంఘాల నాయకులు కలిసి రిలీజ్ చేశారు. నేడు సాయంత్రం 3.00 గంటలకు బొంరాస్ పేట్ మండలంలోని ఏర్పుమల్ల గ్రామంలో భారతరత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కావున ఏర్పుమల్ల గ్రామ దళిత సంఘం నాయకుల ఆహ్వానం మేరకు కులక్చర్ల మండలం నుంచి అంబేద్కర్ అభిమానులు యువజన సంఘాల సభ్యులు పెద్ద మొత్తంలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో దళిత యువజన సంఘం మాజీ అధ్యక్షులు తుప్పలి వెంకటేశం, కుల్కచర్ల మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగని.వెంకట్ రాములు, దళిత యువ శక్తి యువజన సంఘం కుల్కచర్ల గ్రామ మాజీ గఅధ్యక్షులు జెట్టిగళ్ల వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి సాలేటి.రవికుమార్, యువ నాయకులు నాగని ఆంజనేయులు, ప్రజా గొంతుక పత్రికా విలేకర్ ఘంటషాల.పెంటయ్య,పుర్ర బాబు,ఎర్రం పోటీ శ్రీను,తుప్పలి వెంకట్రాములు, దండు వెంకట్,మేకుల భీంసెన్, పోతగళ్ల బాలకృష్ణ,తుప్పలి. బాలకృష్ణ, దొరపల్లి శ్రీనివాస్,సాలెటి నరేష్, కొడుదూటి.భాను, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## మిర్యాలగూడ తహసిల్దారుగా సంతోష్ కిరణ్ బాధ్యతలు స్వీకరణ



మిర్యాలగూడ, క్రైమ్ మిర్రర్ మే 3 : మిర్యాలగూడ తహసిల్దారుగా సంతోష్ కిరణ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డా. త్రిపాఠి ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేసి, ఎన్.హరిబాబును నల్గొండకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో దేవరకొండలో విధులు నిర్వహిస్తున్న సంతోష్ కిరణ్‌ను మిర్యాలగూడకు బదిలీ చేశారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం, సంతోష్ కిరణ్ మర్యాదపూర్వకంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సంతోష్ కిరణ్‌కు డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, రజినీకాంత్, సీనియర్ అసిస్టెంట్ ఎంఏ.మతీన్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు టి. రామకృష్ణ, సత్యనారాయణ, జెఎ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్ సత్యలు స్వాగతం పలుకుతూ, మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

## సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్...1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలి

భద్రాద్రి కొత్తగూడెం మే 03 : ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ఏరియాల జనరల్ మేనేజర్ లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఆయన ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు. ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో



నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని మరియు ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలని, ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణా మరియు నాణ్యతపై కూడా ఆయన సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) .సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ మరియు పర్సనల్) కె.వెంకటేశ్వర్లు, జీఎం (సీపీపీ) ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ చంద్ర పరిగెన్, కార్పొరేట్ జీఎం లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.




# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ముగిసిన విస్తరణ సమావేశాలు

గండిపేట్(క్రైం మిర్రర్): వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల మూడు రోజుల విస్తరణ వార్షిక సదస్సు శనివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి అటారి జోన్ పాడి డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు వ్యవసాయ రంగంలో నూతన మార్పులు రైతులకు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే కృషి విజ్ఞాన కేంద్రాలు నూతనంగా రైతులకు సేవ చేయాలని తెలిపారు. రాబోవు రోజులలో రైతులకు మంచి విత్తనాలు, విస్తరణ సేవలందించాలని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.యాకాద్రి మాట్లాడుతూ కె.వి.కె.లు రైతులకు చాలా శిష్ట సేవలందిస్తున్నాయన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన రకాలు రైతులకు చేరవేసి వాటి విస్తరణ పరిధి గురించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మూడు రోజులు రాష్ట్రంలోని వివిధ కృషి విజ్ఞాన కేంద్రాలు గత సంవత్సరం చేపట్టిన విస్తరణ పనులు, రాబోవు సంవత్సరానికి ప్రణాళికలు ఈ సందర్భంగా చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.కిషన్‌కుమార్, ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు, సహ పరిశోధన సంచాలకులు, కెవికె, అధికారులు పాల్గొన్నారు.

# రంగనాయక సాగర్‌లో ప్రమాదం

### సరదాగా ఈత కొడుతూ ఇద్దరు గల్లంతు

**సిద్దిపేట,(క్రైమ్ మిర్రర్):** జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చిన్నకోడూర్ మండలంలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో శనివారం నలుగురు గల్లంతయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మృతులను మిరాజ్ (15), అర్బాస్ (15)గా గుర్తించారు. వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాలు హైదరాబాద్ వెళ్తూ.. మార్గమధ్యంలో రంగనాయక్ సాగర్ వద్ద ఆగాయి. సరదాగా ఈత కొడుతుండగా.. వీరిద్దరూ నీట మునిగారు. కొద్దిసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు.. వారి కోసం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. కొద్దిసేపటి తర్వాత మిరాజ్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అర్బాస్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. స్థానికుల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన స్థలంలో పోలీసులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# పార్కులను ఆహ్లాదభరితంగా తీర్చిదిద్దుతున్నాం

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

గండిపేట్(క్రైం మిర్రర్): పార్కులను ప్రజలు సేదతీరుతూ, పచ్చని వాతావరణంతో ఉల్లాసంగా గడిపేలా తీర్చిదిద్దడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సారధి యూత్ క్లబ్ జీహెచ్‌ఎంసీ పార్కు, టీఎన్‌జీవోస్ కాలనీలో పార్కు సుందరీకరణ పనుల్లో భాగంగా హార్టికల్చర్ సిబ్బందితో కలిసి శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పుట్‌పాత్‌తో కూడిన ఆహ్లాదకరమైన మొక్కలతో ప్రాంగణంలో ఉండే విధంగా నీటి సౌకర్యం, పార్క్ మెయింటెనెన్స్ జతపరుస్తూ పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫీసర్ అశోక్, బుచ్చిరెడ్డి, సంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎల్.వి.రెడ్డి, అనిల్‌రెడ్డి, పాండుయాదవ్, సుధాకర్, శశిధర్‌రెడ్డి, సాయి, శంకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కిషోర్, వర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సురేష్, అభి, సుమంత్, శానిటేషన్ జవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# పునరుజ్జీవన దిశగా ప్రాణహిత-చేవెళ్ల

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి,(క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని మల్టీస్టేజ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన ప్రాణహిత-చేవెళ్ల పునరుజ్జీవన దిశగా సాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అనంతరం మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి ప్రజల జీవనాధారం ఈ ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, ప్రాజెక్టు పూర్తయితే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రూ.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఇటీ-వల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమీక్షలో కూడా ప్రాజెక్టు పురోగతిపై చర్చించామని తెలిపారు. కొండం చెరువు వద్ద ప్రాణహిత ప్రాజెక్టు ప్రాథమికంగా 0.80 టీ-ఎంసీలకు డిజైన్ చేయబడిందని, అయితే గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దీనిని 3.5 టీ-ఎంసీలకు పెంచారని షబ్బీర్ అలీ వివరించారు. ఇది వల్ల 9 గ్రామాలు , తండాలు ముంపుకు గురవుతాయని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీ-వల జరిగిన సమీక్షలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సైతం అభ్యంతరాలు తెలిపారని వెల్లడించిన షబ్బీర్ అలీ, త్వరలో పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పురోగతిలో భాగంగా ప్రభుత్వంస్థాయిలో భూసేకరణకు రూ. 23.15 కోట్ల నిధులు విడుదల చేయబడ్డాయని షబ్బీర్ అలీ తెలిపారు. దీంట్లో భాగంగా మొదటి విడతగా 316 ఎకరాల భూసేకరణను చేపట్టనున్నట్లు-, మొత్తం 619 మంది రైతులకు పరిహారం చెల్లించే పక్రియ ప్రారంభం అయిందని పేర్కొన్నారు. తిమ్మక్‌పల్లి వద్ద 1.4 టీ-ఎంసీల పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని, వెంటనే రెండో విడత భూసేకరణ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం ప్రణాళిక ప్రకారం కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలి...!

### పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన..!

### నవాబ్ పేట్,మోమిన్ పేట్ మండలాల్లో పర్యటన...!



**క్రైమ్ మిర్రర్ /వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సృజన అధికారులకు సూచించారు.శనివారం వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలం చీమల్ దారి గ్రామంలో,నవాబ్ పెట్ మండలం వట్టిమీనేపల్లి, నవాబ్ పేట్,తిమ్మారెడ్డిపల్లి గ్రామాలల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో కమీషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖిగా మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం కింద ఎన్ని రోజులు పని చేస్తున్నారని, రోజుకు 307 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఉపాధి హామీ కింద పొలాలకు కట్టలు వేసుకోవడమే కాకుండా చెక్ డ్యామ్ ల నిర్మాణాలను పెద్ద మొత్తంలో చేపట్టలని ఆమె అధికారులు సూచించారు.ఆదాయ వనరులు కల్పించే పంటలు సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఉద్యానవన పంటలతో పాటు మునగ,జామ , మామిడి, సీతాఫల్ పంటలను సాగు



చేసుకునే విధంగా ప్రోత్సహించాలని ఆమె అధికారులు సూచించారు.పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పర్యటన భాగంగా అవెన్యూ ప్లాంటేషన్, కాంపోస్ట్ షెడ్, ఫాం పాండ్ నిర్మాణ పనులు పరిశీలించారు.నవాబ్ పెట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కింద నిధులతో చేపట్టిన పౌల్ట్రీ ఫాం ను కమిషనర్ ప్రారంభించారు.కమిషనర్ పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్ సుధీర్,డిఆర్డిఓ శ్రీనివాస్,డిపిఓ జయసుధ,పంచాయత్ రాజ్ ఉమేష్,ఎంపీడీఓలు విజయలక్ష్మి,అనురాధ,ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188



# అమ్మకాలు 'అక్షయం'!

**అక్షయ తృతీయ.. జోరుగా కొనుగోళ్లు!**

**విలువ పరంగా విక్రయాల్లో 35 శాతం వృద్ధి**

**మంగళసూత్రాలు, చైన్‌లు, కాయిన్లకు గిరాకీ**

**దక్షిణాదిన అధిక డిమాండ్**

న్యూఢిల్లీ: అక్షయ తృతీయ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆభరణాల విక్రయాలు సానుకూలంగా నమోదైనట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. బంగారం, వెండి ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ అక్షయ తృతీయ రోజున పసిడి కొంటే కలిసొస్తుందన్న విశ్వాసం అమ్మకాలకు అండగా నిలిచింది. విలువ పరంగా 35 శాతం అధిక అమ్మకాలు ఉంటాయని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్ రోక్డే తెలిపారు. పరిమాణం పరంగా గతేడాది మాదిరే 20 టన్నులుగా ఉండొచ్చని పేర్కొన్నారు. మరోపక్క, బుధవారం బంగారం, వెండి ధరలు కాస్త శాంతించడం కూడా కలిసొచ్చింది. దక్షిణాదిన జ్యుయలరీ దుకాణాలకు ఉదయం నుంచే వినియోగదారులు క్యూకట్టారు. ఉత్తరాదిన మధ్యాహ్నం నుంచి వినియోగదారులు రావడం పెరిగింది. అయినప్పటికీ దక్షిణ భారత్‌లోనే కస్టమర్ల రాక అధికంగా ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా మంగళ సూత్రాలు, చైన్‌లు, వెండి ఉత్పత్తుల కొనుగోళ్లు పెరిగినట్టు వర్తకులు తెలిపారు. వివాహాల సీజన్ ఆరంభం కావడంతో మంగళసూత్రాల కొనుగోలుకు కస్టమర్లు ఆసక్తి చూపించినట్టు చెప్పారు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు ధోరణి సాధారణంగా దక్షిణాదిన కనిపించేది. క్రమంగా ఇది ఉత్తరాదికీ విస్తరించినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 25-%40 ఏళ్ల వయసులోని కస్టమర్లు సైతం బంగారం కొనుగోళ్లకు ముందుకొచ్చినట్టు రోక్డే తెలిపారు. ముఖ్యంగా ఆభరణాలు, కాయిన్లు, బార్లు కొనుగోలుకు ఆసక్తి చూపించినట్టు చెప్పారు. "ధరల పెరుగుదలతో కొనుగోలు శక్తిపై ప్రభావం పడింది. అయినప్పటికీ అక్షయ తృతీయ రోజున బలమైన కొనుగోళ్ల సెంటిమెంట్ ఉంది" అని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా సీఈవో సచిన్ జైన్ తెలిపారు. 2024 అక్షయ తృతీయ రోజున రూ.72,300గా ఉన్న 24 క్యారెట్ల పసిడి ధర ఇటీవలే రూ. లక్ష స్థాయిని అధిగమించి... ప్రస్తుతం 99,000 స్థాయిలో ఉంది. అంటే దాదాపు 37 శాతం ఎగసింది.

**పాత ఆభరణాల మార్పిడి..**

అక్షయ తృతీయ రోజున అమ్మకాల్లో 50 శాతం మేర పాత బంగారం మార్పిడితోనే ఉన్నట్టు పీఎన్‌జీ జ్యుయలర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు. ధరల పెరుగుదలతో వినియోగదారులు బడ్జెట్ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు. మొత్తం మీద గతేడాది అక్షయ తృతీయతో పోల్చి చూస్తే అమ్మకాలు 10%-%15 శాతం పెరిగాయని కామా జ్యుయలర్స్ ఎండీ కొలిన్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా కీలక మార్కెట్లలో స్టడెడ్ జ్యుయలరీ అమ్మకాలు పెరిగినట్టు జీఎస్‌ఐ ఇండియా ఎండీ రమిత్ కపూర్ వెల్లడించారు.

**దిగొచ్చిన బంగారం ధర**

అక్షయ తృతీయ రోజున బంగారం ధరలు తగ్గడం కొనుగోలుదారులకు కలిసొచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.900 తగ్గి రూ.98,550 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు ఒకదశలో 43 డాలర్ల వరకు క్షీణించి 3,274 డాలర్లను తాకింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆటో టారిఫ్‌ల ప్రభావం తగ్గించే దిశగా ఆదేశాలు జారీ చేయడం.. పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి చర్చల్లో పురోగతి ఉందని ప్రకటించడం బంగారం ధరలు తగ్గేందుకు కారణమైనట్టు కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కేనత్ చైన్‌వాలా తెలిపారు.



## ఏటీఎం కొత్త ఛార్జీలు..

ఏటీఎం లావాదేవీలు మరింత భారం కానున్నాయి. ఏటీఎం విత్‌డ్రావల్ కొత్త ఛార్జీలు మే 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఉచిత పరిమితిని మించి చేసే ఏటీఎం లావాదేవాలపై ఛార్జీల పెంపునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుమతి ఇచ్చింది. ఈ రుసుములో ఏటీఎం కొనుగోలు, నిర్వహణ, ఇతర బ్యాంకుల కస్టమర్లకు సేవలను అందించడానికి అయ్యే ఖర్చు కూడా ఉంటుంది.

**సవరించిన ఏటీఎం ఛార్జీలు ఇవే..**

మే 1 నుండి అమల్లోకి వస్తున్న కొత్త నిబంధనల ప్రకారం, వినియోగదారులు తమ ఉచిత ఉపసంహరణ పరిమితిని దాటిన తర్వాత ప్రతి లావాదేవీకి రూ.2 అదనంగా రూ .23 చెల్లించాల్సి ఉంటుంది. ఇది గతంలో రూ .21 ఉండేది. దీన్ని 2022 నుంచి అమలు చేస్తున్నారు.

**ఉచిత లావాదేవీలు**


ఏటీఎం ఛార్జీల పెంపు ఉన్నప్పటికీ ఉచిత లావాదేవీ పరిమితుల్లో ఎలాంటి మార్పులు లేవు. సొంత బ్యాంకు ఏటీఎంలలో నెలకు 5 ఏటీఎం ట్రాన్సాక్షన్స్ ఉచితంగా చేసుకోవచ్చు. ఇక ఇతర బ్యాంకుల ఏటీఎంల విషయానికి వస్తే.. మెట్రో గరాల్లో అయితే 3 లావాదేవీలు, నాన్ మెట్రో నగరాల్లో 5 లావాదేవీలు ఉచితంగా చేసుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సిఫారసుల మేరకు ఆర్బీఐ సవరణలో భాగంగా ఏటీఎం ఫీజులను పెంచింది. నిర్వహణ ఖర్చులు పెరుగుతుండటంతో వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు, బ్యాంకులు ఈ పెంపునకు మొగ్గుచూపుతున్నాయి.

## బ్యాటరీల ఉత్పత్తిని ప్రారంభించిన సిగ్నీ ఎనర్జీ



హైదరాబాద్: విద్యుత్ వాహనాలు, ఎనర్జీ నిల్వ కోసం బ్యాటరీ ప్యాక్‌లను ఉత్పత్తి చేసే సిగ్నీ ఎనర్జీ తన ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లోని ఇ-మొబిలిటీ వ్యాలీలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. తొలి దశలో భాగంగా 1,60,000 చదరపు అడుగుల్లో రూ.100 కోట్ల పెట్టుబడితో దీన్ని నిర్మించింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీఎంఓలో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్ రంజన్ బుధవారం దీన్ని ప్రారంభించారు. సిగ్నీ వ్యవస్థాపకుడు, సీఈఓ వెంకట్ రాజారామన్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి అధిక నాణ్యత, సురక్షిత బ్యాటరీ ప్యాక్‌లను అందించబోతున్నట్లు వివరించారు. ప్రస్తుతం 4.8 గిగావాట్ అధిక సామర్థ్యంతో కూడిన బ్యాటరీ ప్యాక్‌ల ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. రెండో దశ కోసం మరో రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు, 24 నెలల్లో ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. అప్పుడు మొత్తం సామర్థ్యం 10.8 గిగావాట్‌కు చేరుతుందన్నారు. రెండు దశల్లో కలిసి 1,000కి పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం 1 గిగావాట్ ఆర్డర్లు వచ్చాయని పేర్కొన్నారు.

## కొత్త ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లు.. ఫీచర్లు..



హెచ్‌పీ తన తదుపరి తరం ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్‌లను మార్కెట్‌లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. కొత్తగా ప్రవేశపెట్టిన హెచ్‌పీ ఎలైట్ బుక్, ప్రోబుక్, ఓమ్నీబుక్‌లను విభిన్న వ్యాపారాలు, వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. వీటిలో సెకనుకు 40 నుంచి 55 ట్రిలియన్ కార్యకలాపాలను అందించగల డెడికేటెడ్ న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్లు (ఎన్‌పీయూ) ఉన్నాయని పేర్కొంది. ఏఐ కంప్యూటింగ్‌లో ఈ డివైజ్‌లు ముందంజలో ఉన్నాయని తెలిపింది.ఇంటెల్ కోర్ అల్ట్రా 200 వి సిరీస్, ఏఎండీ రైజెన్ ఏఐ 300 సిరీస్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఎక్స్ సిరీస్ చిప్‌లతో ఈ ల్యాప్‌టాప్‌లను తయారు చేసినట్లు సంస్థ చెప్పింది. తాజా ప్రాసెసర్లతో నడిచే ఈ ల్యాప్‌టాప్‌లు అడాప్టివ్ వర్క్‌లోడ్‌ను సర్దుబాటు చేసుకుంటూ రియల్ టైమ్ నాయిస్ క్యాన్సిలేషన్, వీడియో కాల్స్ సమయంలో ఆటో ఫ్రేమింగ్ వంటి ఆప్టిమైజేషన్లను అందిస్తాయని తెలిపింది.

## హైదరాబాద్‌లో 20 లక్షల చ.అ.లు పెద్ద సైజు ఆఫీసులే..

**గ్రేటర్‌లో క్యూ1లో 25 లక్షల చ.అ. లావాదేవీలు**

**ఇందులో 20 లక్షలు పెద్ద సైజు ఆఫీసులే..**


**సావిల్స్ ఇండియా నివేదిక వెల్లడి**



స్థిరాస్తి రంగాన్ని కరోనా ముందు, తర్వాత అని విభజించక తప్పదేమో.. మహమ్మారి కాలంలో ఇంటిలో ప్రత్యేక గది, ఇంటి అవసరం ఎలాగైతే తెలిసొచ్చిందో.. ఆఫీసు విభాగంలోనూ సేమ్ ఇదే పరిస్థితి. కోవిడ్ అనంతరం ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పించాలంటే ఆఫీసు స్థలం విశాలంగా ఉండక తప్పని పరిస్థితి. దీంతో విస్తీర్ణమైన కార్యాలయ స్థలాలకు డిమాండ్ పెరిగింది. హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో 25 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ఇందులో 80 శాతం స్థలం పెద్ద, మధ్య స్థాయి కార్యాలయాల వాటానే ఉన్నాయి. ఈ విభాగంలో 20 లక్షల చ.అ. స్పేస్ లీజుకు పోయింది. అత్యధికంగా 35 శాతం ఐటీ సంస్థలు, 17 శాతం ఫార్మా అండ్ హెల్త్ కేర్ సంస్థలు లీజుకు తీసుకున్నాయని గ్లోబల్ రియల్ ఎస్టేట్ అడ్వైజరీ సావిల్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది తొలి మూడు నెలల్లో దేశంలో కార్యాలయ స్థల లావాదేవీలు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఆరు ప్రధాన నగరాలలో క్యూ1లో 1.89 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లీజుకు పోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. 2020 తర్వాత ఈ స్థాయిలో ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముగింపు నాటికి ఆఫీసు స్పేస్ లావాదేవీలు 7.10 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా.

**సరఫరాలో 28 శాతం వృద్ధి..**

2025 క్యూ1లో ఆరు మెట్రో నగరాల్లో కొత్తగా మార్కెట్‌లోకి 86 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సరఫరా అయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 28 శాతం అధికం. ఈ ఏడాది ముగింపు నాటికి కొత్తగా 8.15 కోట్ల చ.అ. స్థలం అందుబాటులోకి వస్తుందని అంచనా. లీజులలో వృద్ధి, సరఫరా కారణంగా ఈ త్రైమాసికం ముగింపు నాటికి ఆఫీసు స్పేస్ వేకన్సీ రేటు 15 శాతంగా ఉంది. ఇప్పటి వరకు దేశంలోని ఆరు మెట్రోలలో 80.62 కోట్ల చ.అ. గ్రేడ్%-%ఏ ఆఫీసు స్పేస్ అందుబాటులో ఉంది. ఈ ఏడాది ముగింపు నాటికి 87.91 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా. స్థూల ఆర్థికాభివృద్ధి, స్థిరమైన ధరలు, నైపుణ్య కార్మికుల అందుబాటు తదితర కారణాలతో ఐటీ, బ్యాంకింగ్, తయారీ రంగాలలో ఫ్లెక్సీబుల్ ఆఫీసు స్పేస్ లావాదేవీలు పెరగడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థల గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుతో ఆఫీసు స్పేస్ విభాగం మరింత వృద్ధి సాధిస్తుంది.




## మెటా ఏఐ యాప్ వచ్చేసింది..

కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను అందుబాటులోకి తీసుకురావడంలో టెక్ దిగ్గజాల మధ్య పోటీ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల యాజమాన్య సంస్థ మెటా తన ఏఐ సాధనానికి ఎట్టకేలకు మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. టెక్ట్స్ సంభాషణలు, వాయిస్ చాట్స్, ఇమేజ్ ఎడిటింగ్ వంటి ఫీచర్లను అందించే అధునాతన లామా 4 మోడల్‌తో నడిచే ఈ యాప్ ఆండ్రాయిడ్, యాపిల్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది.

**ప్రత్యేక ఫీచర్**

మెటా ఏఐ యాప్ ఒక ప్రత్యేకమైన డిస్కవర్ ఫీడ్‌ను పరిచయం చేసింది. అదే ఏఐతో యూజర్ల ఇంటరాక్షన్‌ను ప్రదర్శించే సోషల్ మీడియా-ప్రేరేపిత ఇంటర్‌ఫేస్. ఇది ఏఐ యాప్ ల్యాండ్ స్కేప్‌లో మొదటిది. సృజనాత్మక కంటెంట్‌ను సృష్టించడం నుండి సంక్లిష్టమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, కమ్యూనిటీ-ఆధారిత అనుభవాన్ని పెంపొందించడం వరకు ఇతరులు మెటా ఏఐని ఎలా ఉపయోగిస్తున్నారో ఈ ఫీచర్ ద్వారా తెలుసుకోవచ్చు. కేవలం టెక్ట్స్ మాత్రమే కాకుండా ఇమేజ్‌లను సైతం సృజనాత్మకంగా ఇందులో సృష్టించవచ్చు.

**వాయిస్ చాట్ కోసం ఎదురుచూపులే..**

ఈ యాప్ ప్రపంచవ్యాప్తంగా లాంచ్ అయినప్పటికీ బాగా ప్రాచుర్యం పొందిన వాయిస్ చాట్ ఫీచర్ మాత్రం భారత్‌లోని యూజర్లకు అందుబాటులో లేదు. ఇది ప్రస్తుతం ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్ యునైటెడ్ స్టేట్స్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. భారత్‌తోపాటు యూఏఈ, మెక్సికో వంటి ఇతర ఈ మార్కెట్లకు వాయిస్ చాట్ ఫీచర్ ఎప్పుడు అందుబాటులోకి తెచ్చేది కంపెనీ వెల్లడించలేదు.భారత్ త్వరలో రే-బాన్ మెటా గ్లాసెస్‌ను పరిచయం చేస్తున్న క్రమంలో మెటా ఈ యాప్‌ను లాంచ్ చేసినట్లు తెలుస్తోంది. మెటా ఏఐ యాప్‌తో అనుసంధానించే ఈ స్మార్ట్ గ్లాసెస్, నావిగేషన్ నుండి రియల్ టైమ్ అనువాదాల వరకు వినియోగదారుల దైనందిన జీవితంలో ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయాన్ని అందిస్తాయి.

# బెంగళూరులో ట్రాఫిక్ చిక్కులకు చెక్

## మే 15ను అమల్లోకి ఎల్లో మెట్రో లైన్

**బెంగళూరు,(క్రైమ్ మిర్రర్):** ఐటీ- పరిశ్రమ విస్తరణతో ఇండియన్ సిలికాన్ వ్యాలీగా గుర్తింపు తెచ్చుకున్న బెంగళూరులోని -టె-క్కీలను చాలా కాలంగా పీడిస్తున్న ట్రాఫిక్ విషయంలో శుభవార్త చెప్పింది. సరైన మెట్రో కనెక్టివిటీ లేకపోవటం కూడా చాలా మంది సొంత వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది.అయితే ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్కీలకు ఒక శుభవార్తను ప్రకటించింది. చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న మెట్రో ఎల్లో లైన్ మే 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు- నమ్మ మెట్రో వెల్లడించింది. ఈ రూటు- ఆర్వీ రోడ్ నుంచి బొమ్మసంద్ర వరకు ప్రయాణికులు సులువు చేయనుంది. అలాగే ఎలక్ట్రానిక్ సిటీ- ప్రాంతంలో నివసించే లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ఎల్లో లైన్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. కొత్తగా మెట్రో ఎల్లో లైన్ రూటు- అందుబాటు-లోకి రావటం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గటంతో పాటు- ఉద్యోగులకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విప్రో, ఇన్ఫోసిస్, హెచ్సీఎల్ వంటి దిగ్గజ -టె-క్ కంపెనీల ఆఫీసులు ఉన్న ఈ ప్రాంతంలో రద్దీ సమస్యలు తగ్గనున్నాయని అధికారులు చెబుతున్నారు. బొమ్మసంద్ర నుంచి ఎలక్ట్రానిక్ సిటీ-కి కేవలం 6 కిలోమీటర్ల దూరం ఉండటంతో మెట్రో కనెక్టివిటీ- ద్వారా కేవలం కొన్ని నిమిషాల ప్రయాణంతోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చని టెక్కీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 14న చైనాలో తయారైన 6 కోచెస్ బెంగళూరుకు చేరుకున్నాయి. త్వరలోనే ఇలాంటివి మరో ఆరింటిని తీసుకురానున్నట్లు- అధికారులు చెబుతున్నారు. ఈ రూట్ స్టార్ట్ అయితే ప్రయాణికులు ఇండస్ట్రియల్ హబ్, రెసిడెన్షియల్ హబ్ మధ్య ప్రయాణం సుగమం అవుతుందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

# అమరావతి అభివృద్ధితో ఎపికి మహర్దశ

## ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన చంద్రాబు

## ఎపి అభివృద్ధిలో బాగస్వామ్యం కావడంపై మోడీ హర్షం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ప్రజల సహకారం, కేంద్ర మద్దతు, పక్కా ప్రణాళికతో అమరావతిని నిర్మిస్తామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భారత్ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. పునర్నిర్మాణ పనుల ప్రారంభం విజయవంతంపై ఎక్స్ లో సిఎం స్పందించారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా, సోషల్ మీడియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదకశక్తిగా నిలిచేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి పునః ప్రారంభంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ లో ప్రధాని ఇలా రాసుకొచ్చారు.. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుంది.. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగు పరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. నాకు మంచి మిత్రుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు.

ఇక, ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను అన్నారు. కాగా, ప్రజల సహకారంతో, కేంద్రం మద్దతుతో పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీ-గా రాజధాని అమరావతిని నిర్మిస్తాం అని హామీ ఇచ్చారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి.. మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని తెలుపుతూ.. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని చంద్రబాబు వెల్లడించారు. మరోవైపు, రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేస్తుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పునః ప్రారంభోత్సవం కార్యక్రమం పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసింది. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే డిజైన్లు రూపొందిస్తున్న సంస్థలతో మంత్రి నారాయణ మాట్లాడుతున్నారు. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ- సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశం అయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల తుది డిజైన్లపై కసరత్తు చేస్తున్నారు. ఆయా భవనాల డిజైన్లను మంత్రి, అధికారులకు ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు వివరిస్తున్నారు.



# అమరావతి పునర్నిర్మాణం ఓ పెద్ద మైలురాయి

### రాజధాని రావడం వైకాపాకు ఇష్టం లేదు

### ఇప్పటికైన ప్రజలకు క్షమాపణ చెబితే మేలు

### మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** ఏపీ రాజధాని అమరావతి అంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కడుపు మంట అంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఫైర్ అయ్యారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. అమరావతి రీలాంచ్ కార్యక్రమంపై స్పందిస్తూ.. రాజధాని పునఃప్రారంభ పనులు గొప్పగా మొదలయ్యాయన్నారు.. అమరావతిపై విషం చిమ్మిన స్వార్థపరులు ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని సూచించారు.. అలా చేస్తే.. తెలుగు ప్రజలు క్షమించకపోయినా.. దేవుడు వారిని క్షమిస్తారని వ్యాఖ్యానించారు.. ఇక, అమరావతి రీలాంచ్ సభకు వచ్చేందుకు వాహనాలు సరిపోక వేలమంది గ్రామాల్లో ఉండిపోయారని తెలిపారు.. సభలో సీఎం చంద్రబాబు నాయుడు పనితీరుపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంపై ఆయనకు ఉన్న కమిట్‌మెంట్‌ను తెలియజేస్తాయన్నారు పార్థసారథి.. అమరావతి శక్తిని సాక్షియాత్తు ప్రధాని మోడీ గుర్తించి కీర్తించారు.. అమరావతి దేవతల రాజధాని అని మోడీ పేర్కొన్నారని గుర్తుచేశారు.. కానీ, అమరావతి భ్రమరావతి అని గత పాలకులు వ్యాఖ్యానించారని మండిపడ్డారు.. గత పాలకులు అమరావతి ప్రాధాన్యతను అవసరాన్ని ఇప్పటి-కై-నా గుర్తించాలని సూచించారు.. ఇక, అమరావతి సభ సమయంలో అగ్ని ప్రమాదం వెనుక ఎవరైనా ఉంటే దానిపై పోలీసులు విచారణలో గుర్తిస్తారని తెలిపారు. అమరావతిని రాజధానిగా రాష్ట్ర ప్రజలు గుర్తించారు.. వైసీపీ గుర్తించాల్సిన అవసరం లేదు.. గుర్తించాలానే ఆలోచన విధానం వారికి . అమరావతి లేదన్నారు.



# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించిన మంత్రి ఆనం

**నెల్లూరు,(క్రైమ్ మిర్రర్):** పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లను శనివారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకున్నారు. పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెంచలకొన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీచేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలువ పందిళ్లు ఏర్పాట్లు- చేయాలని అధికారులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. 12 రోజుల పాటు- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రెండు నెలల క్రితం పులి సంచరిస్తోందని సోషల్ మీడియాలో వచ్చిన నేపథ్యంలో ఫారెస్ట్ డిపార్ట్మెరట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం ఆదేశించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అర్చకుల సూచనల మేరకు ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహోత్సవాలకు ఏర్పాట్లు- చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.

# అమరావతి నిర్మానం బాధ్యత కేంద్రానిదే

### ఐదేళ్లుగా ఎందుకు ఆలస్యం చేశారో మోడీ చెప్పాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్



**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** గత ఐదు సంవత్సరాలుగా అమరావతి పనులు ఆగిపోయి నందుకు ప్రధాని నరేంద్ర మోడీయే బాధ్యత వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు.. పనులు ఆగిపోవడంపై ఎందుకు చర్యలు తీసుకోలేద``న్నారు. అమరావతి రీలాంచ్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పది సంవత్సరాలకు రాజధాని నిర్మాణానికి పునాదిరాయి వేశారు.. అయితే, దేశంలో కొత్త రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాల్సింది.. అలా ఇవ్వకుండా అప్పు ఇప్పించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు.. అమరావతి పునఃనిర్మాణం సభలో ప్రధాని మోడీ ప్రత్యేక హోదా మాట ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు నారాయణ..మరోవైపు.. కేంద్ర ప్రభుత్వం కుల గణన చేయడాన్ని సీపీఐ స్వాగతిస్తోందన్నారు నారాయణ.. 2029 కల్లా కుల గణన పూర్తిచేసి బీసీ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.. రాష్ట్రంలో కోడికత్తి, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులు అలానే ఉన్నాయి.. ఆ కేసులను కూడి నిగ్గు తేల్చాలి అని సూచించారు. ఏపీ అభివృద్ధి పథాన్ని మెరుగు పరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన మీడియా, సోషల్ మీడియాకి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తులిపారు.

# పాక్ నుంచి అన్నిరకాల దిగుమతులపై భారత్ నిషేధం

### దిగుమతులపై పూర్తి నిషేధం విధింపు



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాకిస్థాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాక్ దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిషేధం విదేశీ వాణిజ్య విధానం 2023లో భాగంగా కొత్త నిబంధనగా చేర్చబడింది. దీనిలో భాగంగా, పాకిస్థాన్ నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకునే లైసెన్సులను రద్దు చేయడం, ఎలాంటి సరుకుల ప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ నిషేధంతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. భారత ప్రభుత్వం ఈ చర్యను అంతర్జాతీయ వేదికలపై కూడా న్యాయబద్ధంగా నిలబెట్టే ప్రయత్నం చేయనుంది. ఉగ్రవాదంపై సోరులో ఇది ఒకటని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించింది. జాతీయ భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిషేధం వెంటనే అమలులోకి వచ్చింది. రవాణాలో ఉన్న వస్తువులతో సహా పాకిస్థాన్ నుంచి వచ్చే లేదా ఆ దేశం నుంచి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులపై వర్తిస్తుంది.ఈ క్రమంలో పాకిస్థాన్‌లో లేదా అక్కడి నుంచి ఎగుమతి చేయబడిన అన్ని వస్తువుల దిగుమతి లేదా రవాణా అన్నీ కూడా వెంటనే నిషేధించబడతాయి. ఈ నిషేధానికి మినహాయింపు కోసం భారత ప్రభుత్వం ముందస్తు అనుమతి అవసరమని వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న భాతర్ ఇలా మరో గట్టి షాకిచ్చింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది.పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ-వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి.

# విశాఖ జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు

### హంతకుడు ప్రస్నకుమార్ మిశ్రా అరెస్ట్.. డబ్బుకోసమే హత్యచేసినట్లు సిపి వెల్లడి

**విశాఖపట్టణం, (క్రైమ్ మిర్రర్):** విశాఖలో కలకలం రేపిన దువ్వాడ జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు.. దువ్వాడ పీఎస్ పరిధిలో జరిగిన వృద్ధ దంపతుల డబుల్ మర్డర్ కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేశారు. అప్పు తీర్చాలని అడిగినందుకు యోగేంద్ర బాబు, లక్ష్మీల హత్య చేసినట్లు విచారణలో తేల్చారు ఆర్థిక లావాదేవీలతో పాటు- వివాహేతర సంబంధం కూడా కారణమని గుర్తించారు.. నిందితుడు ప్రసన్న కుమార్ మిశ్రా.. హత్యకుగురైన లక్ష్మీతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి విస్తు పోయే నిజాలు వెల్లడించారు.. ఈ కేసులో అంతర్జాతీయ స్థాయిలో నేరాలకు పాల్పడ్డ వ్యక్తి నిందితుడిగా గుర్తించాం అన్నారు.

# రేషన్‌కార్డుదారులకు శుభవార్త

### కెవైసీ గడవు జూన్ 30 వరకు పొడిగింపు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు కసరత్తు చేపట్టిన సర్కార్.. కార్డుల జారీకి ముందు రేషన్‌కార్డుకు ఈ కేవైసీ పక్రియను మొదలుపెట్టింది. ఇందుకోసం ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డు ఈ కేవైసీ చేసుకునేందుకు గడువు విధించింది. అయితే ఏప్రిల్ 30 తేదీ దాటినప్పటికీ కొందరు ఈ కేవైసీ పక్రియను పూర్తి చేయలేదు. ఈ క్రమంలో కేవైసీని చేసుకునేందుకు గడువును జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఆ గడువు లోపు ఈకేవైసీని పూర్తి చేయాలని స్పష్టం చేసింది. బోగస్ కార్డులను ఏరివేయడంతో పాటు- రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ కేవైసీ పక్రియను తీసుకువచ్చింది ప్రభుత్వం. రేషన్‌కార్డులు ఉన్న వారు రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఈ కేవైసీని చేసుకునే విధానాన్ని కూడా అమలులోకి తీసుకొచ్చారు. చాలా గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడ్డారు.



# లైట్ కలర్ శారీలో పూజా హెగ్డే సోయగాలు

స్లిమ్ బ్యూటీ పూజా హెగ్డే ఏ డ్రెస్ ధరించినా అందానికి లోటు ఉండదు. తాజాగా ఆమె చీరకట్టులో మెరిసిపోయింది. లైట్ మింట్-గ్రే మిక్స్డ్ కలర్ ప్యూర్ కాటన్ శారీ ధరించిన పూజా హెగ్డే... ఆర్ట్ వర్క్ చేసిన మ్యాచింగ్ బ్లౌజ్... ఇయర్ రింగ్స్... మెడలో హారాలు... చేతికి సింపుల్ గా ఎర్రటి మట్టిగాజులు... వేలికి ఉంగరం... నుదుటన చిన్న బొట్టుతో... ముగ్ధ మనోహరంగా దర్శనమిచ్చింది. ఈ ఫొటో షూట్లో అమ్మడు పలు భంగిమల్లో కుర్రాళ్ల మదిలో గిలిగింతలు పెట్టేలా కనిపించింది. కొన్ని ఫొటోల్లో చిరునవ్వుతో, మరికొన్ని ఫొటోల్లో ఏదో ఆలోచనలో ఉన్నట్టు, అష్ట విధ నాయికలను తలపించేలా మరికొన్ని ఫొటోల్లో... మొత్తమ్మీద పూజా హెగ్డే అంటే ఇదీ అనిపించేలా సోయగాలు ఒలకబోసింది. ఇదంతా తమిళ స్టార్ హీరో సూర్యతో జతగా నటించిన 'రెట్రో' సినిమా కోసం. ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. ఇటీవల పూజా హెగ్డే తెలుగులో సినిమాలు తగ్గించి, తమిళంలో జోరు పెంచింది. ప్రస్తుతం ఆమె చేతిలో కాంచన-4, జననాయగన్ చిత్రాలున్నాయి. రజనీకాంత్ కూలీ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ లోనూ పూజా నటించనున్నట్టు తెలుస్తోంది.



# కుటుంబ ప్రేక్షకులు రావడం మాకు ఆశ్చర్యం: శైలేష్ కొలను

"హిట్: ది థర్డ్ కేస్' సినిమాకి ఒక వర్గం ప్రేక్షకులే వస్తారనుకున్నాం. గత రెండు రోజులుగా థియేటర్స్ విజిట్ చేస్తున్నాం. చాలామంది మహిళలు రావడం గమనించాం. నానీగారిని అర్జున్ సర్కార్‌లాంటి వైవిధ్యమైన పాత్రలో చూడటానికి ఎగ్జైట్‌మెంట్‌తో వస్తున్నారనిపించింది. మా అంచనాలను దాటి కుటుంబ ప్రేక్షకులు రావడం, వారి స్పందన సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది" అని శైలేష్ కొలను చెప్పారు. నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల1న విడుదలైంది. ఈ సందర్భంగా శైలేష్ కొలను చెప్పిన విశేషాలు...'హిట్: ది థర్డ్ కేస్'లో అర్జున్ సర్కార్‌గా నాని పాత్ర ఎలా ఉంటుందో 'హిట్ 2' చివర్లో గ్లింప్స్‌లా చూపించా. అప్పుడే ఆడియన్స్‌కి ఓ అవగాహన వచ్చింది. అర్జున్ సర్కార్ పాత్రపై నాకు, నానీగారికి మొదటినుంచీ నమ్మకం




# నాకు గుడి కట్టండి... ఫ్యాన్స్‌ను కోరుతున్న ఐటమ్ బాంబ్

బాలీవుడ్ నటి, ఐటమ్ బాంబ్ ఊర్వశి రౌతేలా మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తెలుగులో 'వాల్తేరు వీరయ్య', 'స్కంద' వంటి చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో నర్తించి గుర్తింపు పొందిన ఈమె, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఉత్తర భారతదేశంలో తన పేరు మీద ఒక గుడి ఉందని, అదే విధంగా దక్షిణాదిలో కూడా అభిమానులు తనకు గుడి కట్టాలని కోరుకుంటున్నానని ఆమె పేర్కొనడం వివాదానికి దారితీసింది. ఇటీవల ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ, "నార్త్ ఇండియాలో నా పేరు మీద ఒక గుడి ఉంది. బద్రీనాథ్ టెంపుల్ పక్కన ఉన్న ఊర్వశి టెంపుల్ నా కోసం కట్టారు. అలాగే టాలీవుడ్‌లో చిరంజీవి సినిమాతో ఎంట్రీ ఇచ్చి, వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు రావడంతో నాకు ఇక్కడ కూడా అభిమానులు ఏర్పడ్డారు. ఉత్తరాదిలో లాగే దక్షిణాదిలో కూడా నా అభిమానులు గుడి కట్టాలని కోరుకుంటున్నాను," అని అన్నారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఆమె వ్యాఖ్యలు అతిశయోక్తిగా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా 'తనకు గుడి కట్టాలి' అని కోరడంపై తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ జరుగుతోంది. గతంలో కూడా ఊర్వశి రౌతేలా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాలున్నాయి. తాను నటించిన సినిమా వంద కోట్లు వసూలు చేసిందని, అదే సమయంలో విడుదలైన కియారా అద్వానీ సినిమా ఫ్లాప్ అయిందని ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. తాజాగా గుడికి సంబంధించిన వ్యాఖ్యలతో ఆమె మరోసారి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

# మంచు లక్ష్మి ఫ్యాషన్ షోలో తళుక్కున మెరిసిన అరవింద్ కృష్ణ

నటి, నిర్మాత మంచు లక్ష్మి నేతృత్వంలో కొనసాగుతున్న 'టీచ్ ఫర్ చేంజ్' సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ స్పెషల్ ఈవెంట్ లో యువ కథానాయకుడు అరవింద్ కృష్ణ పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించాడు. హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీ వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఫ్యాషన్ షోలో అరవింద్ కృష్ణ ర్యాంప్ వాక్ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. తనదైన స్టైల్, ఆత్మవిశ్వాసంతో కూడిన నడకతో ఈవెంట్‌కు ప్రత్యేక శోభను తీసుకొచ్చాడు. ఫ్యాషన్ కు దాతృత్వం జోడించి, 'టీచ్ ఫర్ చేంజ్' లక్ష్యాలకు మద్దతు కూడగట్టే ఉద్దేశ్యంతో మంచు లక్ష్మి ఈ ఫ్యాషన్ షోను ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమానికి అరవింద్ కృష్ణ రాక మరింత గ్లామర్‌ను జోడించింది. ఆయన ఉత్సాహం అదనపు స్పార్క్‌ను జోడించింది. కాగా, అరవింద్ కృష్ణ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన సినిమా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.